ANN తెలుగు

Follow: @ANNTELUGU

01-11-2025

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ | సంపుటి- 22 | సంచిక- 326 | పేజీలు-08 | వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## కామెడీ స్కిట్స్ బంద్ చేయండి

### బీఆర్ఎస్ నేతలకు కేసీఆర్ క్లాస్

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంపై అసంతృప్తి**

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు అనుసరిస్తున్న తీరుపై ఆ పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. టిఫిన్ సెంటర్లలో దోసెలు వేయడం, కూరగాయలు అమ్మడం, హెయిర్ సెలూన్‌లో కటింగ్ చేయడం వంటి 'కామెడీ స్కిట్స్' మానేయాలని నేతలకు హితోపదేశం చేశారట. ఎన్నికల ప్రచారం అంటే సరదా కాదని, సీరియస్ క్యాంపెయిన్ చేయాలని గులాబీ బాస్ దిశానిర్ధేశం చేసినట్లు సమాచారం. మాజీ మంత్రి మల్లారెడ్డి వంటి కొందరు నేతలు ఈ తరహా సరదా పనులను ప్రచారంలో భాగం చేయడంతో, అది ఓటర్లను ఆకర్షించలేదని కేసీఆర్ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.

మిగతా 2లో

**టాప్ న్యూస్**


### ఆర్ఎస్ఎస్‌ను బ్యాన్ చేయాలి



- బీజేపీ, ఆర్ఎస్ఎస్ వల్లే శాంతి భద్రతల సమస్యలు
- ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఫైర్

02

### ఫిరాయింపు ఎంఎల్ఏల విచారణ



- 2 నెలల గడువు కోరిన స్పీకర్
- నలుగురు ఎంఎల్ఏలను విచారించనున్న అసెంబ్లీ కార్యదర్శి

02

### కర్నూలు బస్సు ప్రమాదం



- వైసీపీ నేత యాంకర్ శ్యామలపై కేసు నమోదు

02



## జూబ్లీహిల్స్ హీట్

### ఓ వైపు సీఎం రేవంత్..

### ఇంకోవైపు కేటీఆర్

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ప్రచారం కీలకదశకు చేరింది. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ వెంగళరావునగర్ నుండి ప్రచారం ప్రారంభించగా, రోడ్ షోకు భారీ స్పందన లభించింది. మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా షేక్ పేట డివిజన్ నుండి రోడ్ షో ప్రారంభించగా, దీనికి కూడా పెద్ద ఎత్తున స్థానికులు హాజరయ్యారు. ఇద్దరు అగ్రనేతలు ఒకేసారి రోడ్ షోలు స్టార్ట్ చేయగా.. ప్రచారం దుమ్మురేగింది. సీఎం ప్రచారంతో కాంగ్రెస్ పార్టీకి ఒక్కసారిగా ఊపురాగా, భారీ మెజారిటీపై కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. మరోవైపు బీఆర్ఎస్ కేటీఆర్ రోడ్ షోల విజయవంతంపై ఆనందం వ్యక్తం చేసింది.

# కాంగ్రెస్‌లో పదవుల బొనాంజా

## మంత్రిగా అజారుద్దీన్

- ఇద్దరు సీనియర్ ఎమ్మెల్యేలకు కేబినెట్ హోదా
- ప్రభుత్వ సలహాదారుగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- ఆరుగ్యారంటీల అమలు పర్యవేక్షణ బాధ్యతలు
- రాష్ట్ర పౌరసరఫరాల కార్పోరేషన్ ఛైర్మన్‌గా ప్రేమ్ సాగర్ రావు
- డిసెంబర్ లో పూర్తిస్థాయి కేబినెట్ విస్తరణ.. మరో ఇద్దరికి ఛాన్స్
- రాజగోపాల్ రెడ్డి లేదా మల్ రెడ్డి లలో ఒకరికి ఛాన్స్..
- ఆది శ్రీనివాస్ లేదా ఐలయ్యలలో మరొకరికి
- డిసెంబర్ కాకుంటే సమ్మర్ లో గుజరాత్ ఫార్ములా.. సంపూర్ణ ప్రక్షాళన

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ పార్టీలో లేటైనా నేతలకు లేటెస్ట్ పదవులొస్తున్నాయి. అనూహ్యంగా అజారుద్దీన్ కు మంత్రి పదవి దక్కింది. శుక్రవారం ఆయన ప్రమాణస్వీకారం చేశారు. మైనారిటీ కోటాలో అనేకమంది పదవులు ఆశించినా షబ్బీర్ అలీ, ఫహీం ఖురేషీ, అమిర్ అలీ వంటి నేతలున్నా లక్కు అజారుద్దీను వరించింది. జూబ్లీహిల్స్ లో ఇది అడ్వాంటేజ్ గా మారుతుందని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. ఇదే సందర్భంలో మంత్రి పదవులు ఆశించిన సీనియర్లకు.. సామాజిక సమీకరణలు, జిల్లాల లెక్కలు పరిగణనలోకి తీసుకుని కేబినెట్ హోదాతో ఇతర పదవులు కట్టబెట్టింది. నిజామాబాద్ జిల్లా నుండి మంత్రి పదవి ఖాయమనుకున్న పి.సుదర్శన్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమించింది. ఆరుగ్యారంటీల అమలు పర్యవేక్షణ బాధ్యతలు సుదర్శన్ రెడ్డికి అప్పగించారు. ఇక మంచిర్యాల ఎమ్మెల్యే, మంత్రి పదవి కోసం గట్టిగా పట్టుబట్టిన ప్రేమ్ సాగర్ రావు కు కేబినెట్ హోదాతో కీలకమైన పౌరసరఫరాల కార్పోరేషన్ ఛైర్మన్ పదవిని అప్పగించారు.

మిగతా 2లో

# అధైర్య పడొద్దు.. అందర్నీ ఆదుకుంటాం

### వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం జరిగింది

- నష్టపోయిన రైతుకు ఎకరానికి రూ.10 వేలు అందజేస్తాం
- ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా
- మొంథా తుపాన్ ప్రభావంతో 12 జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగింది
- నాలాలను కబ్జా చేసి అడ్డంకులు సృష్టిస్తే ఎవరినీ వదలొద్దు: సీఎం రేవంత్
- ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం తదితర ప్రాంతాల మీదుగా ఏరియల్ సర్వే




**హన్మకొండ, మహా:** భారీ వర్షాల వల్ల 16 జిల్లాల్లో జరిగిన నష్టంపై జిల్లాల వారిగా సమగ్రమైన నివేదికలు తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. భారీ వర్షాలు, వరదల వల్ల 12 జిల్లాల్లో తీవ్రంగా నష్టం వాటిల్లిందని, పంట నష్టానికి పరిహారం చెల్లించాల్సి ఉన్నందున అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వారం రోజుల్లో సమగ్రమైన నివేదికలు అందించాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల వల్ల నష్టపోయిన ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం తదితర ప్రాంతాల మీదుగా ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే చేశారు. అనంతరం హనుమకొండ చేరుకున్న ముఖ్యమంత్రి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితులతో మాట్లాడారు. వరద నష్టంపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, హన్మకొండ, వరంగల్ కలెక్టర్లు, ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి బాధిత కుటుంబాలను ఆదుకునే విషయంలో స్పష్టమైన సూచనలు ఇచ్చారు.

**ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలి..**

"వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం జరిగింది. నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు 10 వేల రూపాయల చొప్పున పరిహారం అందించాలని అనుకుంటున్నాం.

మిగతా 2లో

## ఐఏఎస్ అధికారుల బదిలీలు

- 8 మందికి బదిలీలు, పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు
- పథకాల అమలులో వేగం పెంచాలనే లక్ష్యంగా మార్పులు

హైదరాబాద్, మహా: రాష్ట్రంలో మరోసారి ఎనిమిది మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు, పదోన్నతులు చేపట్టింది సర్కార్. ఈ మేరకు చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

మిగతా 2లో

## జీడీపీ అంటే.. గ్రాస్ ఎంపవర్మెంట్ ఆఫ్ పీపుల్

**ఫ్యూచర్-రెడీగా ఉండే అభివృద్ధి నమూనాకు రోడ్‌మ్యాప్ సిద్ధం**

**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం**

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, మహా:** ప్రభుత్వం దృష్టిలో 'జీడీపీ' అంటే కేవలం 'గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్' కాదని, గ్రాస్ ఎంపవర్మెంట్ ఆఫ్ పీపుల్ (జీఈపీ) అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. భారత్ '15' ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారే ప్రయాణంలో 'తెలంగాణ'ను కీలక భాగస్వామిగా మార్చుతామన్నారు. శుక్రవారం బేగంపేట్‌లోని ఐటీసీ కాకతీయలో నిర్వహించిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సదరన్ రీజినల్ కౌన్సిల్ సమావేశంలో 'డ్రైవింగ్ ఇండస్ట్రియల్ గ్రోత్ అండ్ ఇన్నోవేషన్; తెలంగాణ రోడ్ మ్యాప్ టూ త్రీ ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ' అనే అంశంపై

మిగతా 2లో






### హైదరాబాద్ వీధుల్లో రయ్.. రయ్

- సిటీకి 2 వేల ఎలక్ట్రిక్ బస్సులు
- క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా నిలబెట్టడంతో మరో అడుగు

02

### ఓటు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు

ఎర్రగడ్డ డివిజన్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పాదయాత్ర

వివరాలు 2లో

**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,25,620 |
| 22 క్యారెట్ | 1,15,150 |
| సిల్వర్ (కేజీ) | 1,55,000 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | ₹ 5.55 | 166.5 |
| హోల్ సేల్ గుడ్డు ధర | ₹ 5.55 | 166.5 |
| రిటైల్ గుడ్డు ధర | ₹ 5.88 | 176.49 |

## కర్రెగుట్టల్లో మరోమారు తుపాకీల మోత

- హిడ్మా ఉన్నాడన్న సమాచారంతో చుట్టుముట్టిన భద్రతా బలగాలు
- ఇరు వైపులా కాల్పుల మోత.. ఇరువైపులా ప్రాణనష్టం లేదంటున్న భద్రతా బలగాలు
- ఖమ్మం, ములుగులో టెన్షన్ వాతావరణం



**ఛత్తీస్‌ఘడ్, మహా :** మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా జరుగుతున్న తెలంగాణ, చత్తీస్ గడ్ సరిహద్దు కర్రెగుట్టల్లో శుక్రవారం మరో మారు తుపాకీ చప్పుళ్లు వినిపించాయి. భద్రతా బలగాలు కర్రెగుట్టల్లో క్యాంపులను ఏర్పాటు చేసుకునే క్రమంలో అక్కడికి వెళ్లాయి. మావోయిస్టులు భద్రతాబలగాలపై కాల్పులు జరపడంతో ఆత్మరక్షణ కోసం భద్రతాబలగాలు మావోయిస్టులపై కాల్పులు జరిపినట్టు సమాచారం. అయితే ప్రాణ నష్టం జరగలేదని తెలుస్తోంది. మావోయిస్టు, అగ్రనేత హిడ్మా నేతృత్వంలోని పిఎల్ జి ఒకటో బెటాలియన్ సభ్యులు కర్రెగుట్టల్లో తలదాచుకున్నారని పక్కా సమాచారం ఉండటంతో భద్రతా బలగాలు ఇక్కడికి వచ్చినట్టు తెలుస్తోంది.

మిగతా 2లో




# కాంగ్రెస్‌లో పదవుల బొనాంజా

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి పదవి రేసులో సీనియర్లుగా ఉన్న నేతలకు కీలక బాధ్యతలు అప్పగించడంతో ఖాళీగా ఉన్న రెండు పదవులకు లైన్ క్లియర్ అయినట్లు పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**డిసెంబర్ లో విస్తరణ**

తాజా నియామకాలతో మంత్రివర్గంలో ఖాళీల భర్తీకి కూడా లైన్ క్లియర్ అయిందన్న ప్రచారం జరుగుతోంది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి , ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిలలో ఒకరికి ఛాన్స్ ఖాయమన్న ప్రచారం జరుగుతోంది. బీసీలలో కూడా విప్ ఆది శ్రీనివాస్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యలు బీసీ కోటాలో రేసులో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కేబినెట్ పై అధిష్ఠానం ఒక్కొక్కటిగా చిక్కుముడులు విప్పుకుంటూ వస్తోంది. ఈ క్రమంలో ఖాళీల భర్తీ జరుగుతుందా? లేక సమ్మర్ లో గుజరాత్ తరహాలో సంపూర్ణ ప్రక్షాళన ఉంటుందా అన్న చర్చలు జరుగుతున్నాయి. పలువురు నేతలకు కార్పోరేషన్ ఛైర్మన్లు, డీసీసీ అధ్యక్ష పదవులు, పీసీసీలో పెండింగ్ పదవులు అన్నీ నవంబర్ లో భర్తీ చేసే అవకాశాలున్నాయి.



## కర్నూలు బస్సు ప్రమాదం

### వైసీపీ నేత, యాంకర్ శ్యామలపై కేసు నమోదు

**కర్నూలు, మహా :** ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామ సమీపంలో హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న కావేరి బస్సు దగ్ధమైంది. ఈ ప్రమాదంపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై ఫిర్యాదు అందడంతో కర్నూలు తాలుకా అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా 27 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ జాబితాలో వైసీపీ అధికార ప్రతినిధి, యాంకర్ ఆరే శ్యామల, సీవీ రెడ్డి, కందుకూరి గోపి కృష్ణతోపాటు వైసీపీ అధికార ఎక్స్ పేజీ నిర్వాహకులు ఉన్నారు. ఈ కర్నూలు బస్సు ప్రమాదం బెల్టు షాపులు, కల్తీ మద్యం కారణంగానే జరిగిందంటూ వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది. ఆ క్రమంలో కర్నూలు మండలం బి. తాండ్రపాడుకు చెందిన పేరపోగు వెనుములయ్య పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## ఫిరాయింపు ఎంఎల్ఏల విచారణ

- రెండు నెలల గడువు కోరిన స్పీకర్
- నలుగురు ఎంఎల్ఏలను విచారించామన్న అసెంబ్లీ కార్యదర్శి

**హైదరాబాద్, మహా :** ఫిరాయింపు ఎంఎల్ఏలపై విచారణ గడువును పొడిగించాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సుప్రింకోర్టును అభ్యర్థించారు. తెలంగాణ అసెంబ్లీ తరపున లాయర్లు శుక్రవారం కోర్టులో పిటీషన్ దాఖలుచేశారు. బీఆర్ఎస్ ఫిరాయింపు ఎంఎల్ఏల విచారణకు సుప్రింకోర్టు విధించిన మూడు నెలల గడువు అక్టోబర్ 31తో ముగుస్తుంది. అయితే విచారణ ఇంకా పూర్తికాలేదు. అనర్హత వేటును ఎదుర్కొంటున్న పదిమంది ఎంఎల్ఏలను విచారించి రిపోర్టు సబ్మిట్ చేయాలని సుప్రింకోర్టు మూడునెలల క్రితం స్పీకర్ ను ఆదేశించిన విషయం తెలిసిందే. విచారణ జరిపి రిపోర్టు అందచేసేందుకు అప్పట్లో స్పీకర్ కు సుప్రింకోర్టు మూడునెలలు మాత్రమే గడువిచ్చింది. సుప్రింకోర్టు ఆదేశాల ప్రకారం విచారణ మొదలుపెట్టినా హాజరయ్యింది నలుగురు ఎంఎల్ఏలు మాత్రమే. ఎందుకంటే కోర్టులో జరిగినట్లుగానే ప్రతి ఎంఎల్ఏ తరపున వాదన వినిపించేందుకు లాయర్లు, ప్రతివాదన వినిపించేందుకు బీఆర్ఎస్ ఎంఎల్ఏల తరపున లాయర్లకు స్పీకర్ అవకాశాలు ఇస్తున్నారు. అంటే ఇదంతా చాలా పెద్ద ప్రొసీజర్. అందుకనే చాలా సమయం పడుతోంది. ఇదే విషయాన్ని స్పీకర్ తరపు లాయర్లు తమ పిటీషన్లో సుప్రింకోర్టుకు విన్నవించారు. మధ్యలో మూడువారాలు అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు విదేశాలకు వెళ్ళొచ్చారు. మరో ఎడుగురు పిరాయింపు ఎమ్మెల్యేలను విచారించాల్సిన అవసరం ఉన్నందున గడువు కావాలని స్పీకర్ కోరారు. స్పీకర్ అభ్యర్థనపై సుప్రీంకోర్టు ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి.

# అధైర్య పడొద్దు.. అందర్నీ ఆదుకుంటాం

## వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం జరిగింది

- పంట నష్టపోయిన ఎకరాకు రూ.10 వేలు అందజేస్తాం
- ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియా
- మొంథా తుపాన్ ప్రభావంతో 12 జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగింది
- నాలాలను కబ్జా చేసి అడ్డంకులు సృష్టిస్తే ఎవరినీ వదలొద్దు: సీఎం రేవంత్
- ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం తదితర ప్రాంతాల మీదుగా ఏరియల్ సర్వే



(మొదటిపేజీ తరువాయి)

క్షేత్రస్థాయిల్లో పంట నష్టం వివరాలను నమోదు చేస్తూ నివేదికలివ్వాలి. వరదల వల్ల ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని ప్రభుత్వం ఇదివరకే ఉత్తర్వులు జారీ చేసింది. విధానపరమైన లోటుపాట్లు లేకుండా వెంటనే వివరాలను నమోదు చేయాలి. ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా పొలాల్లో ఇసుక మేట తొలగించాలి. దానికి అంచనాలు రూపొందించండి. వరదల వల్ల నష్టపోయిన వారికి ఎంత చేసినా వారి నష్టం పూడ్చలేనిది. ఇండ్లు నష్టపోయిన వారికి 15 వేల చొప్పున పరిహారం అందించాలి. అత్యంత నిరుపేదలు ఉంటే వారి అర్హత మేరకు అదనంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలి. వరదల వల్ల నిరాశ్రయులైన వారి జాబితాలను తయారు చేయండి. భారీ వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో దాదాపు అన్ని చోట్లా దాదాపుగా ఇదే రకంగా నష్టం వాటిల్లింది. క్షేత్రస్థాయిలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పంట నష్టం, పశు నష్టంతో పాటు ఇండ్లు, రోడ్లు, కల్వర్టుల వంటి మౌలిక సదుపాయాలు దెబ్బతిన్న ప్రాంతాలకు సంబంధించి సమగ్రమైన నివేదికలు తయారు చేయాలి. ప్రజాప్రతినిధులు సైతం కిందిస్థాయిలో జరిగిన నష్టంపై కలెక్టర్లకు నివేదికలు సమర్పించాలి. నష్టం అంచనాలను తయారు చేయడంలో విపత్తు నిర్వహణ విభాగం ఒక ఫార్మేట్‌ను తయారు చేసి అన్ని జిల్లాల నుంచి నివేదికలు తెప్పించాలి. ఇలాంటి విపత్తు సమయాల్లో రాష్ట్ర ప్రభుత్వం అందించే సహాయంతో పాటు కేంద్రం నుంచి కూడా నిధులను రాబట్టుకోవలసిన అవసరం ఉంది. ఇందులో ఏమాత్రం అలసత్వం వద్దు. ఇలాంటి సమయాల్లో కేవలం తాత్కాలిక పరిష్కారం వైపు కాకుండా శాశ్వత పరిష్కారాలకు కృషి చేయాలి. వరదల విషయంలో అడ్డంకులను తొలగించకపోవడం కూడా నష్టం ఎక్కువగా జరగడానికి ఆస్కారమించింది. నీటి వనరుల ఇన్‌ఫ్లోస్, అవుట్ ఫ్లోస్ విషయాల్లో నీటి పారుదల శాఖ అంచనాలను పరిగణలోకి తీసుకోవాలి. లేదంటే వర్షాలొచ్చినప్పుడు మళ్లీ ఇదే సమస్యలు వస్తాయి. అలాంటివి రానివ్వకండి.

**పది మంది కబ్జాలకు పాల్పడితే పది వేల మందికి నష్టం..**

శాఖల మధ్య సమన్వయం ఉండాలి. ముఖ్యంగా రోడ్లు భవనాలు, నీటి పారుదల, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్ తదితర శాఖల మధ్యన సమన్వయం ఉండాలి. ఏ విభాగం తర్వాత ఏ విభాగం పనులు పూర్తి చేయాలన్న సమన్వయం ఉండాలి. నాలాలను కబ్జా చేసి అడ్డంకులు సృష్టించే వారి విషయంలో ఎవరినీ వదలొద్దు. కఠినంగా వ్యవహరించాలి. పది మంది కబ్జాలకు పాల్పడితే పది వేల మందికి నష్టం జరుగుతోంది. ఉమ్మడి వరంగల్ కోర్ అర్బన్ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు ఇతర మౌలిక సదుపాయాల విషయంలో ఇంచార్జీ మంత్రి మున్సిపల్, నీటి పారుదల శాఖ అధికారులతో సమన్వయ పరిచి సమగ్రమైన ప్రణాళిక తయారు చేయాలి. కొన్ని చోట్ల స్మార్ట్ సిటీ పనులను వదిలేశారు. పనులను వదిలేయడానికి వీలులేదు. మిగిలిపోయిన పనులను పూర్తి చేయడానికి నివేదికలివ్వండి. క్లౌడ్ బరస్ట్ ఇక అయిపోయిందన్న నిర్లక్ష్యం వద్దు. గత ఏడాది కూడా ఇలాంటి వర్షాలొచ్చాయి. వాతావరణంలో పెనుమార్పులు సంభవిస్తున్నాయి. ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాల్సిందే. భారీ వర్షాల వల్ల జరిగిన నష్టం, తీసుకోవలసిన చర్యలపై వారం రోజుల్లోగా కలెక్టర్లు నివేదికలు అందించాలి. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే. నివేదికలను బట్టి వారం రోజుల్లో అన్ని జిల్లాల కలెక్టర్లు నివేదికలు అందించాలి. నివేదికలు అందిన తర్వాత రాష్ట్రస్థాయిలో అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించి అవసమైన చర్యలు తీసుకుంటాం. వరద సహాయక కార్యక్రమాల కోసం ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుంది. బాధితులను ఆదుకోవడంలో లేదా క్షేత్రస్థాయిలో నివేదికలు రూపొందించడంలో ఎవరు నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుంది." అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ వరదల సమయంలో కొందరు అధికారులు బాగా పనిచేశారని చెబుతూ వారిని ముఖ్యమంత్రి అభినందించారు.

# హైదరాబాద్ వీధుల్లో రయ్.. రయ్

## సిటీకి 2 వేల ఎలక్ట్రిక్ బస్సులు

### క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా నిలబెట్టడంతో మరో అడుగు




**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ నగరంలో కాలుష్య రహిత రవాణా సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతుంది. పీఎం ఈ డ్రైవ్ కింద కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ కి కేటాయిస్తున్న ఎలక్ట్రిక్ బస్సుల ఆపరేషన్స్‌లో ఎదురయ్యే సవాళ్లు, మౌలిక సదుపాయాలపై స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిలతో కలిసి సెక్రటేరియట్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర రాజధాని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా నిలబెట్టడానికి డీజిల్ బస్సుల స్థానంలో పర్యావరణ హితమైన దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతుంది. అందులో భాగంగా దేశ వ్యాప్తంగా పీఎం ఈ డ్రైవ్ కింద 9 నగరాల్లో 15 వేల ఎలక్ట్రిక్ బస్సులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతుంది. అందులో తెలంగాణలో హైదరాబాద్ నగరానికి 2 వేల ఎలక్ట్రిక్ బస్సులు మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కింద ఒక్కో బస్సుకు 35 లక్షల రూపాయలు కేటాయిస్తుంది. ఈ బస్సులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నవంబర్ 6 వ తేదీ టెండర్లు పిలిచింది. ఎలక్ట్రిక్ బస్సులు ఆపరేట్ లో రాష్ట్రానికి కావల్సిన మౌలిక సౌకర్యాలు ,ఎదురవుతున్న ఇబ్బందులు, టెక్నికల్ ఆపరేషన్స్ పై సమీక్షా సమావేశంలో చర్చించారు.

ఇప్పటికే రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలను మరింత ప్రోత్సహించడానికి 2వీలర్స్ 3వీలర్స్ , 4వీలర్స్, బస్సులు, ట్రక్కులు ట్రాక్టర్లు వంటి ఇత్యాది వాహనాలకు పన్ను ప్రయోజనాలను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈవీ పాలసిని తీసుకొచ్చింది. 2019 మార్చిలో 40 యూనిట్లతో దేశంలోనే ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. 2023 సేకరణ ప్రణాళిక కింద 1010 అదనపు ఎలక్ట్రిక్ బస్సులను (510 ఇంటర్‌సిటీ మరియు 500 సిటీ బస్సులు) చేర్చాలని టీజీఎస్ ఆర్టీసీ ప్రణాళిక సిద్ధం చేయడంతో పాటు ఇప్పటికే లెటర్స్ ఆఫ్ అవార్డును జారీ చేసింది. ప్రస్తుతం, 775 ఎలక్ట్రిక్ బస్సులు (510 ఇంటర్‌సిటీ మరియు 265 సిటీ బస్సులు) నడుస్తున్నాయి. మిగిలిన 275 మార్చి 2026 నాటికి అందుబాటులోకి రానున్నట్లు ప్రాథమిక అంచనా వేసింది.

ఈబస్ రంగంలోని రెండు ప్రముఖ భారతీయ ఓఈఎంలతో టీజీఎస్ ఆర్టీసీ గణనీయమైన ఆపరేటింగ్ అనుభవాన్ని పొందింది. అయితే గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని ఎలక్ట్రిక్ బస్సుల తయారీ కంపెనీల ప్రతినిధులతో ఎదురవుతున్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లింది. కొంతమంది ఆపరేటర్లు టెండర్ షరతులను పాటించకపోవడం. ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంలో జాప్యం లాంటివి జరుగుతున్నాయి. ఇబస్ డెలివరీలలో అసాధారణ జాప్యం. బ్రేక్‌డౌన్ ఫ్రీక్వెన్సీ పరంగా ఇబస్‌ల పనితీరు తక్కువగా ఉండటం. డీజిల్ బస్సులతో పోలిస్తే సర్వీస్ రద్దు, ప్రమాద రేటు ఎక్కువ నమోదు లాంటివి జరుగుతున్నాయి.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారంతో పాటు తగిన మద్దతు కై హామీ ఇస్తుంది. పీఎం ఈ డ్రైవ్ పథకం కింద ఇబస్‌ల సజావుగా ఆపరేషన్ జరిగేలా చర్యలు తీసుకుంటుంది.ఎంపిక చేసిన డిపోలలో అప్‌స్ట్రీమ్ హైటెన్షన్ విద్యుత్ కనెక్షన్‌లను సకాలంలో ఏర్పాటు చేస్తుంది.

## జీడీపీ అంటే.. గ్రాస్ ఎంపవర్మెంట్ ఆఫ్ పీపుల్

(మొదటిపేజీ తరువాయి)

ఆయన కీలక ఉపన్యాసం చేశారు. 'అర్బన్ ఇంజిన్', 'ఇండస్ట్రియల్ హార్ట్ ల్యాండ్', 'రూరల్ ట్రాన్స్ఫర్మేషన్ జోన్' అనే మూడు మూల స్థంభాలుగా తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఇందుకోసం అమలులో వేగం, అవకాశాలలో పారదర్శకత, రూపకల్పనలో 'ఫ్యూచర్‌రెడీ'గా ఉండే కొత్త అభివృద్ధి నమూనాకు 'రోడ్‌మ్యాప్'ను సిద్ధం చేస్తున్నామన్నారు.

**హైదరాబాద్ జీడీపీ 350 బిలియన్ డాలర్లకు..**

2035 నాటికి హైదరాబాద్ జీడీపీ 350 బిలియన్ డాలర్లకు చేరేలా సర్వీసెస్, సస్టెనబిలిటీ, స్మార్ట్ లివింగ్ కు గ్లోబల్ క్యాపిటల్, నెట్ జీరో ఫ్యూచర్ సిటీగా తీర్చిదిద్దుతామన్నారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతాన్ని గ్లోబల్ 'చైనా + 1' అవకాశాన్ని అందిపుచ్చుకునేలా కీలకమైన పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేస్తామని మంత్రి అన్నారు. ప్రతి రైతును పారిశ్రామికవేత్తగా మార్చేలా అగ్రిప్రాసెసింగ్ క్లస్టర్లు, డిజిటల్ అనుసంధానం కలిగిన ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేస్తామన్నారు. ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ సిటీ, ఇమేజ్ టవర్స్, టీహబ్ ఫేజ్ 2 ద్వారా రాష్ట్రంలో ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ మరింత పటిష్టమవుతుందన్నారు. రాష్ట్రంలో 2030 నాటికి '20 గిగావాట్స్' పునరుత్పాదక శక్తిని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐఐ సదరన్ రీజియన్ ఛైర్మన్ థామస్ జాన్ ముత్తూట్, డిప్యూటీ ఛైర్మన్ రవి చంద్రన్, సీఐఐ తెలంగాణ కౌన్సిల్ ఛైర్మన్ శివప్రసాద్ రెడ్డి, వైస్ ఛైర్మన్ గౌతం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కామెడీ స్కిట్స్ బంద్ చేయండి

(మొదటిపేజీ తరువాయి)

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని కేసీఆర్ పార్టీ నేతలను ఆదేశించారు. ఈ ఎన్నిక రానున్న స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపుతుందని కేసీఆర్ భావిస్తున్నారు. అందుకే, ప్రచారంలో తమ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా వివరించాలని సూచించారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, తాగునీటి సౌకర్యం, ఐటీ రంగ అభివృద్ధి, శాంతి భద్రతలు వంటి అంశాలను హైలైట్ చేయాలని ఆదేశించారు. ఇదే సమయంలో, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ సూచించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తి స్థాయిలో అమలు కాలేదన్న అంశాన్ని బలంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రచారంలో ఇలాంటి కామెడీ స్కిట్స్ సోషల్ మీడియా ప్రచారానికి పనికొస్తాయే తప్ప, ఓటర్లను ఏ మాత్రం ఆకట్టుకోలేవని కేసీఆర్ స్పష్టం చేశారు.

# ఓటు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు

## ఎర్రగడ్డ డివిజన్ లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పాదయాత్ర

**హైదరాబాద్, మహా :** రెండేళ్లుగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను అమలు చేయకుండా ఓట్లేయాలని అడిగే నైతిక హక్కు ఆ పార్టీ కార్యకర్తలకు లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. స్థానికంగా అనేక సమస్యలు ఉన్నాని, ఇక్కడ దయనీయమైన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎర్రగడ్డ డివిజన్ లోని పలు కాలనీల్లో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పాదయాత్ర చేశారు. ఇంటింటికి వెళ్లి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మజ్లిస్ పార్టీతో రహస్య ఒప్పందం చేసుకుని ఇక్కడ పోటీ చేస్తోందన్నారు. ఇక్కడి ప్రజలు గూండాయిజాన్ని, రౌడీయిజాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోరని కిషన్ రెడ్డి అన్నారు. ఒక్క ఫోన్ కాల్ చేస్తే మీ సమస్యలను తీర్చేందుకు బిజెపి ముందుంటుందని కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు. స్థానిక ఎంపీగా నేను అనేక నిధులు కేంద్రం నుంచి తీసుకొచ్చి, అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు కిషన్ రెడ్డి వివరించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం చుట్టుపక్కల నియోజక వర్గాలు అన్నీ అభివృద్ధి చెందాయి. కానీ జూబ్లీహిల్స్ మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు తయారయ్యిందన్నారు. గతంలో బీఆర్ఎస్ కు, కాంగ్రెస్ కు అవకాశం కల్పించారు. ఈ సారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని ప్రజలు నిర్ణయించేసుకున్నారని కిషన్ రెడ్డి అన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరిని కలిసి ఓటేయాలని కోరినప్పుడు మంచి స్పందన వస్తుంది. అంతేకానీ ఇతర పార్టీల్లాగా రాజకీయాలు చేయాలని బిజెపి అనుకోవట్లేదు అని కిషన్ రెడ్డి అన్నారు. మా నిజాయితే మా పార్టీని గెలిపిస్తుందని కిషన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ హాయంలో జూబ్లీహిల్స్ లో ఎలాంటి అభివృద్ధి లేదు. కాంగ్రెస్ ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేదని కిషన్ రెడ్డి అన్నారు. బీజేపీకి గెలవడం ఖాయమని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డి వెంట తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షురాలు, మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి, ఎర్రగడ్డ డివిజన్ ఎన్నికల ఇన్ చార్జి మేకల సారంగపాణి, బీజేపీ సీనియర్ నేతలు, స్థానిక కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు.

## కర్రెగుట్టల్లో మరోమారు తుపాకీల మోత

(మొదటిపేజీ తరువాయి)

ఇటీవల మావోయిస్టుల లొంగుబాట్లు, ఎన్ కౌంటర్లు ఎక్కువైన నేపథ్యంలో కర్రెగుట్టల్లో మరో మారు భయానక వాతావరణం ఏర్పడింది. 288 చదరపు కిలో మీటర్ల విస్తరించిన కర్రెగుట్టల్లో తెలంగాణలో 90 కిలోమీటర్లు విస్తరించింది. ఆపరేషన్ కగార్ ప్రారంభమైన తర్వాత మావోయిస్టులు ఎక్కువగా కర్రెగుట్టల్లోనే తలదాచుకున్నట్లు సమాచారం. బచావో కర్రె గుట్టలు, ఆపరేషన్ కర్రెగుట్టలు పేరుతో మావోయిస్టులను నిర్మూలించే కార్యక్రమాలు ఎక్కువగా కర్రెగుట్టల్లోనే జరిగాయి. 24 వేల మంది సాయుధ కేంద్ర బలగాలు స్థావరం చేసుకుని ఆపరేషన్లు చేసాయి. డ్రోన్లతో నిరంతరం పర్యవేక్షణ జరుగుతోంది. ఆరుగురు పిఎల్‌జి సభ్యులు కర్రెగుట్టల్లోనే హతమయ్యారు. కర్రెగుట్టల్లో మావోయిస్టులు తలదాచుకున్నట్లు ప్రచారం జరిగినప్పటికీ కేవలం ఆరుగురు మావోయిస్టులు మాత్రమే కర్రెగుట్టల్లో చనిపోవడం భద్రతా బలగాలకు నిరాశ పరిచింది. ఆపరేషన్ సింధూర్ ప్రారంభమైన తర్వాత చత్తీస్ గడ్ లోని కేంద్రబలగాలు వెనక్కి వెళ్లిపోయాయి. అయితే ఆపరేషన్ కగార్ కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో కేంద్ర బలగాలు మళ్లీ కర్రెగుట్టల్లోకి వచ్చాయి. ఏప్రిల్, మే నెలల్లో కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు వచ్చినప్పటికీ పెద్దగా పురోగతి సాధించ లేదు. వెయ్యి మంది తలదాచుకున్న ఓ బంకర్ ను భద్రతా బలగాలు గుర్తించాయి. కర్రెగుట్టల్లో 30 భారీ కొండలు ఉన్నాయి. మావోయిస్టులు ఇక్కడే తలదాచుకున్నట్లు భద్రతా బలగాలు అనుమానిస్తున్నాయి. చత్తీస్ గడ్ బలగాలు ఎక్కువగా అబూజ్ మడ్ వైపు ఫోకస్ పెట్టాయి. కరడు గట్టిన మొంథా తుఫాను కారణంగా కర్రెగుట్టల్లో బురదవల్ల నడవడమే కష్టంగా ఉంది. ఒక్కసారిగా తుపాకీల మోత వినిపించడంతో ఖమ్మం, ములుగులో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఎప్పుడు ఏమవుతుందో నని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

## ఆర్ఎస్ఎస్‌ను బ్యాన్ చేయాలి

### బీజేపీ, ఆర్ఎస్ఎస్ వల్లే శాంతి భద్రతల సమస్యలు
### ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఫైర్



**ఢిల్లీ, మహా:** దేశంలో ఎక్కువగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తడానికి బీజేపీఆర్ఎస్ఎస్ కారణమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ క్రమంలో ఆర్ఎస్ఎస్ నిషేధించాలన్నది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ చేసిన విమర్శలను ఖర్గే తిప్పికొట్టారు. 1948లో మహాత్మా గాంధీ హత్య తర్వాత ఆరెస్సెస్‌ను విమర్శిస్తూ పటేల్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ చీఫ్ ఉదహరించారు. ఉక్కు మనిషి సర్దార్ పటేల్, ఉక్కు మహిళ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ గొప్ప నేతలని ఖర్గే పేర్కొన్నారు. వారు దేశానికి ఎంతో సేవ చేశారని, దేశ ఐక్యతను కాపాడేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పై నిషేధం వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. అది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. మహాత్మాగాంధీ హత్యకు దారితీసిన వాతావరణాన్ని ఆరెస్సెస్ సృష్టించిందని మండిపడ్డారు.

ఇదే విషయాన్ని పేర్కొంటూ నాటి హోంమంత్రి పటేల్.. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి లేఖ రాశారని గుర్తుచేశారు. భారత తొలి ప్రధాని నెహ్రూ, సర్దార్ పటేల్‌ల మధ్య గొప్ప సంబంధాలు ఉన్నప్పటికీ.. వారి మధ్య చీలిక తెచ్చేందుకు నిత్యం ప్రయత్నించేవారని దుయ్యబట్టారు. దేశ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన పటేల్‌ను నెహ్రూ ప్రశంసించారని, పటేల్ కూడా నెహ్రూను దేశానికి ఆదర్శంగా అభివర్ణించారని పేర్కొన్నారు. కశ్మీర్ మొత్తాన్ని దేశంలో కలపాలని పటేల్ కోరుకున్నారని, కానీ.. నాటి ప్రధాని నెహ్రూ ఆ ప్రయత్నాలను జరగనివ్వలేదంటూ ప్రధాని మోదీ ఆరోపించడంపై ఖర్గే తీవ్రంగా స్పందించారు. అయితే, ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ స్పందించింది. దశాబ్దాలపాటు పటేల్ చేసిన సేవలను కాంగ్రెస్ విస్మరించిందని పేర్కొంది.

## ఐఏఎస్ అధికారుల బదిలీలు

- 8 మందికి బదిలీలు, పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు
- పథకాల అమలులో వేగం పెంచాలనే లక్ష్యంగా మార్పులు

(మొదటిపేజీ తరువాయి)

దీంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు ఫ్లాగ్‌షిప్ అభివృద్ధి కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు అనుభవజ్ఞులైన అధికారులను కీలక విభాగాల్లో నియమించింది.




**బదిలీలు, పదోన్నతులు..**

- సబ్యసాచి ఘోష్: 'ఫ్లాగ్‌షిప్ వెల్ఫేర్ స్కీమ్స్ యూనిట్' అమలు కోసం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. అదనంగా సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు.
- అనితా రామచంద్రన్: మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శిగా కొనసాగుతూనే, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు.
- ఇలంబరితి కె: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏ అండ్ యుడి) శాఖ కార్యదర్శి పదవి నుండి ప్రభుత్వ కార్యదర్శి పదవికి బదిలీ.
- బి. శ్రీధర్: బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పదవి నుంచి జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ (జీఏ విభాగం) కార్యదర్శిగా నియామకం.
- సైదులు: అభివృద్ధి సంక్షేమ పనుల అమలు విభాగం ప్రత్యేక కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు.
- జి.జితేందర్ రెడ్డి: ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్‌గా నియమించింది. అలాగే, ఎస్సీ సహకార సంస్థ ఎండీగా ఆయనకు అదనపు బాధ్యతలు.
- డా.యష్మీన్ బాషా: హార్టికల్చర్ డైరెక్టర్‌గా కొనసాగుతూనే, ఆమె టిజి ఆయిల్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు.
- ఎంఏ అండ్ యూడీ శాఖ కార్యదర్శి పూర్తి అదనపు బాధ్యతలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతోనే కొనసాగుతాయి.

**పథకాల అమలులో వేగం..**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. ఈ బదిలీలు.. బాధ్యతల పునర్విభజన ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో సమతుల్యతను తీసుకురావడమే కాకుండా.. ముఖ్య పథకాల అమలులో వేగం పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా సంక్షేమ, పశుసంవర్ధక, గిరిజన అభివృద్ధి, రవాణా, నగరాభివృద్ధి వంటి విభాగాలు ప్రజల దైనందిన జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే రంగాలు కావడంతో.. ఈ నియామకాలు కీలకమవుతున్నాయి.



### ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం

## నిర్లక్ష్యం వీడాలి

**ఎండి జహంగీర్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు**

**వలిగొండ, మహా :** ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం విడాలని తలసి మొలకెత్తిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జహంగీర్ అన్నారు శుక్రవారం వలిగొండలో సిపిఎం నాయకులతో పర్యటించిన సందర్భంగా వలిగొండ మార్కెట్ యార్డులో ధాన్యం కొట్టుకుపోయి నష్టపోయిన రైతులందరికీ వెంటనే ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించాలని ఆయన మాట్లాడారు.. అధికారులు పర్యటించిన కనీసం రైతులను ఆదుకునే చర్యలను చేపట్టలేదని ఇప్పటికైనా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మార్టూరు బాలరాజ్ సిరిపంగి స్వామి కూర శ్రీనివాస్ దుబ్బ లింగం బుచ్చిరెడ్డి నానించర్ల రమేష్. రైతులు గంగదారి రాములు మునుకుంట్ల సుశీల పబ్బు కర్ణాకర్ మల్ల నరేష్ అనూష ఆవుల నరేష్ మోటే స్వాతి అంజయ్య తదితరులు పాల్గొన్నారు



### అంగన్వాడి పాఠశాల రికార్డులను

## పరిశీలించిన ఎంపీడీవో

**ఎంపీడీవో జలంధర్ రెడ్డి**

**వలిగొండ, మహా :** వలిగొండ మండల పరిధిలోని రెడ్ల రేపాక గ్రామంలో శుక్రవారం వలిగొండ మండల ఎంపీడీవో జలంధర్ రెడ్డి అంగన్వాడి పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు



## వైసీపీకి భారీ షాక్...!

**టీడీపీలో చేరిన 63 కుటుంబాలు**

**విజయనగరం జిల్లా, మహా:** బొబ్బిలి మండలం, కోమటిపల్లి గ్రామానికి చెందిన 63 కుటుంబాలు ,ఒక వార్డు మెంబరు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బొబ్బిలి నియోజకవర్గం, బొబ్బిలి మండలం, కోమటిపల్లి గ్రామానికి చెందిన మాజీ వైస్ ప్రెసిడెంట్, మాజీ కోఆపరేటివ్ ప్రెసిడెంట్ ఆవాల తిరుపతి ఆధ్వర్యంలో 10 కుటుంబాలు, 4వ వార్డు మెంబరు వెలమల పెద అప్పలనాయుడు కోమటిపల్లి రెల్లివీధికి చెందిన 53 కుటుంబాలు,గొట్టాపు నారాయణరావు గ్రామ టీడీపీ పెద్దల ఆధ్వర్యంలో,ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కే.కే. రంగారావు బేబీ నాయన సమక్షంలో శుక్రవారం నాడు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి కి, బొబ్బిలి నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే బేబీ నాయన చేస్తున్న అభివృద్ధి తమను టీడీపీ వైపు ఆకర్షించిందని అన్నారు.

# నకిలీ నోట్లలో రూ.500 నోట్లే అధికం

**హైదరాబాద్, మహా :** రోజురోజుకు దేశంలో నకిలీ నోట్ల చెలామణి ఎక్కువవుతున్నాయి. ఇందులో ఎక్కువగా 500రూపాయల నోటే ఎక్కువగా చెలామణిలో ఉందని ఆర్బీఐ గుర్తించింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక వ్యవహారాల శాఖ డేటా ప్రకారం, కొత్త మహాత్మా గాంధీ సిరీస్ నుండి 2023-24లో 85,711, 2022-23లో 91,110తో పోలిస్తే ఇది పెరిగింది. 202425 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ సిరీస్ రూ. 500 నకిలీ నోట్ల సంఖ్య 1,17,722 కు పెరిగింది. గత సంవత్సరాల్లో గుర్తించిన సంఖ్యతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల అని ఆర్థిక వ్యవహారాల శాఖ పేర్కొంది. 202223 ఆర్థిక సంవత్సరంలో 91,110 నకిలీ నోట్లు గుర్తించగా, 2023 24 ఆర్థిక సంవత్సరంలో 85,711 నకిలీ నోట్లు, 202425 ఆర్థిక సంవత్సరంలో 1,17,722 నకిలీ నోట్లు గుర్తించడం జరిగిందని నివేదికలో పేర్కొంది.



కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక వ్యవహారాల శాఖ విడుదల చేసిన డేటా ప్రకారం.. దేశంలో అత్యంత ఎక్కువగా చెలామణి అవుతున్న నోట్లలో ఎక్కువగా 500రూపాయల నోట్లే ఉన్నాయని వెల్లడించింది. నకిలీ రూ.2,000 నోట్ల సంఖ్య తగ్గిన తర్వాత, నకిలీ రూ.500 నోట్ల సంఖ్య పెరిగింది. వాటిని చలామణి నుంచి ఉపసంహరించుకున్నప్పుడు నకిలీ రూ.2,000 నోట్ల ప్రసరణ గరిష్ట స్థాయికి చేరుకుంది.

202223 ఆర్థిక సంవత్సరంలో 9,806గా ఉన్న నకిలీ రూ.2,000 నోట్ల సంఖ్య 202324 ఆర్థిక సంవత్సరంలో 26,035కి పెరిగింది. అయితే, 2024 25 ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 3,508కి బాగా తగ్గింది. నకిలీ నోట్లు తయారు చేస్తున్న కేటుగాళ్లు తమ దృష్టిని చలామణిలో లేని రూ.2,000 నోట్ల నుండి విస్తృతంగా చెలామణిలోకి వచ్చిన రూ.500 నోట్ల వైపు మళ్లించారని ఈ డేటా ద్వారా తెలుస్తోంది. ఈ నకిలీ నోట్ల చెలామణిని నియంత్రించడానికి భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్ బీఐ) సహకారంతో కరెన్సీ నోట్ల భద్రతా లక్షణాలను నిరంతరం సమీక్షిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం, 1934లోని సెక్షన్ 25 ప్రకారం, నకిలీల నుండి ముందుండడానికి కొత్త డిజైన్లు, భద్రతా మెరుగుదలలను ప్రవేశపెట్టడం నిరంతర ప్రక్రియ అని మంత్రిత్వ శాఖ తెలిపింది.

## రెండేళ్ళలోనే రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన కాంగ్రెస్

**బీఆర్ఎస్‌లో చేరిన ఎంఐఎం నాయకులు.. పార్టీలోకి ఆహ్వానించిన కేటీఆర్**

**హైదరాబాద్, మహా :** రెండేళ్లలోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టుపట్టించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పలువురు ఎంఐఎం నేతలకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. నోటికొచ్చిన హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఎద్దేవా చేశారు. తులం బంగారం ఇస్తాం, యువతులకు స్కూటీలు ఇస్తాం, వృద్ధులకు నాలుగు వేల పెన్షన్ ఇస్తామంటూ ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఫైరయ్యారు. ఇలాంటి సమయంలోనే ప్రజలు తెలివిగా ఆలోచించాలని పిలుపునిచ్చారు. రెండేళ్లలోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఎలా దారి తప్పించిందో గుర్తుచేసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. డబ్బులు ఇచ్చి ప్రలోభ పెట్టేందుకు కూడా కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, ఆ డబ్బులు తీసుకొని మిగితా బాకీ డబ్బులు ఎప్పుడిస్తారో నిలదీ



యాలని అన్నారు. ఇవి కారుకు, బుల్డోజర్‌కు మధ్య జరుగుతున్న ఎన్నికలని కేటీఆర్ అభివర్ణించారు. పేదల ఇండ్లు కూలగొట్టిన ఈ బుల్డోజర్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కొందరు కాంగ్రెస్ నేతలు ప్రజలపై బెదిరింపులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే వారికి ఎవ్వరూ భయపడాల్సిన పనిలేదని ఆయన ధైర్యం చెప్పారు. ప్రజలకు తాము ఎప్పటికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా పనిచేయాలన్నారు. కారు గుర్తుకు ఓటేసి మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



## ఎకరాకు రూ. 10 వేలు కాదు.. 50 వేలు ఇవ్వండి

**మానవతా దృక్పథంతో రైతన్నలను ఆదుకోవాలి**

**ప్రభుత్వానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్**

**కరీంనగర్, మహా:** రాష్ట్రంలో భారీ వర్షాలకు పంట నష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ. 10 వేలు కాకుండా.. ఎకరాకు రూ. 50 వేలు పరిహారం ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో కొట్టుకుపోయిన కల్వల మత్తడిని శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. కల్వల మత్తడి కొట్టుకుపోయి 3 ఏళ్ళు అవుతోందని.. దీని రిపేర్ కోసం గత ప్రభుత్వమే రూ. 70 కోట్లు విడుదల చేస్తూ జీవో ఇచ్చిందని, కానీ తర్వాత ప్రభుత్వం మారటంతో పనులు జరగటం లేదన్నారు. ఈ మత్తడిని రిపేర్ చేయించాలని హుజూరాబాద్, మానకొండూరు నియోజకవర్గ ఇద్దరు ఎమ్మెల్యేలను కోరుతున్నట్లు తెలిపారు. 6 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే ఈ ప్రాజెక్ట్‌పై వందలాది రైతు కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు.

**బండి సంజయ్ ఆ పని చేయాలి..**

మొంథా తుపాను కారణంగా తెలంగాణ మొత్తం రైతులు నష్టపోయారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్, ఖమ్మం రైతులకు మాత్రమే ఎకరాకు రూ. 10 వేలు ఇస్తామన్నట్లుగా విన్నామని చెప్పారు. శంకరపట్నంలో కూడా వరి రైతులు నష్టపోయారని.. వారికి కూడా పరిహారం ఇవ్వాలన్నారు. ఎకరాకు రూ. 10 వేలు కాకుండా ఎకరాకు రూ. 50 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాదాపు చేతికొచ్చిన పంటను రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఇప్పుడు పంట కోసిన కూడా 25 శాతం వచ్చే పరిస్థితి లేదన్నారు. అందుకే ప్రభుత్వం రైతుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ చొరవ చూపి అధికారులను ఫీల్డ్ కు పంపించి పంట నష్టం లెక్కలు తీయాలన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా కేంద్రం తరఫున రైతులకు పంట నష్టం పరిహారం ఇప్పించాలని కోరారు. కల్వల మత్తడి రిపేర్ కోసం ముఖ్యమంత్రితో ఎంపీ మాట్లాడాలన్నారు. అటు ఈ ప్రాజెక్ట్ మీదనే దాదాపు 180 ముదిరాజ్ కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని.. వారికి ఇదే జీవనాధారమని చెప్పారు. వెంటనే మత్తడి బాగు చేయించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



## దేశ ఐక్యతాయోధుడు సర్ధార్ వల్లభాయ్ పటేల్

**కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జె సి రాజు**

**విజయనగరం జిల్లా. మహా:** స్వతంత్ర భారత దేశ సమైక్యతా యోధుడు,స్వాతంత్ర్య సమర యోధుడు సర్ధార్ వల్లభాయ్ పటేల్ అని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జె సి రాజు అన్నారు.శుక్రవారం కారుణ్య ఫౌండేషన్ కార్యాలయంలో వల్లభాయ్ పటేల్ 150 జయంతి నేపథ్యంలో జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని కారుణ్య కార్యదర్శి సి హెచ్ జె ప్రవీణ్ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జె సి రాజు మాట్లాడు తూ.. భారత దేశ ఉక్కు మనిషిగా ఖ్యాతి గాంచిన పటేల్ దేశభక్తికి పట్టుదలకు నిదర్శనం అన్నారు,మొదటి హోమ్ మంత్రిగా స్వదేశీ సంస్థానాలను విలీనం చేసి దేశ సమైక్యత రూపశిల్పి గా,ఐక్యతకు చిహ్నంగా నిలిచారన్నారు. సర్ధార్ పటేల్ జీవితం ఆదర్శం అని అన్నారు కార్యక్రమంలో కారుణ్య సభ్యులు జి సిహెచ్ జి శర్మ, ఏ చిన్నారావు,కె రామ కృష్ణ,పి కృష్ణ మోహన్ తదితరాలు పాల్గొన్నారు.




### ఘనంగా ఏఐటీయూసీ

## 106వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

**జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మునకాల శ్రీనివాస్**

**విజయనగరం జిల్లా. మహా:** దేశ స్వాతంత్ర పోరాటంలో కార్మిక వర్గాన్ని చైతన్యం చేసి అగ్ర భాగాన నిలబడి బ్రిటిష్ వారిని తరిమికొట్టడంలో కీలక పోరాట భూమిక పోషించిన మొట్ట మొదటి కార్మిక సంఘం ఏఐటియుసి అని. ఏఐటియుసి 1920 అక్టోబర్ 31న ఏర్పడిందని ఇప్పుడు 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటుదని బొబ్బిలి పట్టణంలో శుక్రవారం నాడు జండా మహల్ సెంటర్ లో జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ముందుగా ఏఐటీయూసీ పతాకావిష్కరణను జిల్లా డిప్యూటీజనరల్ సెక్రెటరీ మునకాల శ్రీనివాస్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలలో భాగంగా బ్రిటిష్‌కాలంలో కార్మికుల చేత రోజుకు సుమారు 15 గంటలు పని చేయించుకుని వారి శ్రమను దోచుకున్న బ్రిటిష్ వారి విధానాలను అవలంబిస్తూ కార్మికుల శ్రమని కార్పొరేట్ శక్తులకు ధారాధత్వం చేయడానికి తీసుకున్న నిర్ణయానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వత్తాసు పలకడం వర్గాన్ని మోసం చేయడమే అన్నారు. జిల్లాలో జూట్ మిల్లులు. ఫెర్రోయెల్లోస్ కంపెనీలు మూతపడడం వలన వేలాది మంది కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని. ఎన్నికల ముందు కార్మిక వర్గానికి ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సరైన పరిశ్రమలు లేక ఎంతో నైపుణ్యత కలిగిన నిరుద్యోగ యువత బతుకు తెరువు కోసం ఇతర దేశాలకు వలస పోయే పరిస్థితి వచ్చిందని అన్నారు. ఎనిమిది గంటల పని దినాలానే కొనసాగించాలని నేను యెడల ఏఐటీయూసీ కార్మికుల పక్షాన పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

## ఎల్బీనగర్‌లో ఫేక్ గ్యాంగ్ హల్చల్..!

**జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల పేరుతో వసూళ్లు..!**

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ నడి బొడ్డున ఉండే ఎల్బీనగర్ లో ఇంటి నిర్మాణదారుల నుండి మామూళ్ళు వసూలు చేసే బ్యాచ్ రూట్ మార్చింది. టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలా వసూళ్లకు పాల్పడతారు అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన బ్యాచ్ సదురు ఇంటి నిర్మాణదారుడు చిన్న డివియేషన్ చేసిన వారిని ఫోన్లో సంప్రదించి బెదిరింపులకు పాల్పడుతుంది. అలాంటి బ్యాచ్ ఎల్బీనగర్ లో ప్రతిరోజు చక్కర్లు కొడుతుంది. అవినీతికి పాల్పడే టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా దీనిపై ఫిర్యాదు చేయడానికి భయపడుతున్నట్టు తెలుస్తోంది. హయత్ నగర్ సర్కిల్ 3 పరిధిలో జరిగే అక్రమ నిర్మాణాల వద్దకు వెళ్లి ఇంటి నిర్మాణదారులను భయభ్రాంతులకు గురి చేస్తుంది. చివరికి తామే బల్దియా అధికారులం అని చెప్పి ముడుపులు వసూలు చేస్తుంది. ఇదంతా తెలిసినా జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు వాళ్ళ అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

**సైబర్ నెరగాళ్లను మించిపోయారు..!**

బల్దియా హయత్ నగర్ సర్కిల్ 3 పరిధిలో వసూళ్ల బ్యాచ్ సైబర్ నేరగాలను మించిపోయారు. ఎక్కడ నిర్మాణం జరిగినా అక్కడ వాలిపోతున్నారు. జిహెచ్ఎంసి అధికారుల అలసత్వం, లంచగొండితనం వీరికి కాసులు కురిపిస్తుంది. చిన్న చిన్న డివియేషన్ ఉన్న సదురు నిర్మాణదారుడికి ఫోన్ చేసి భయపెడుతుంది. తాము జిహెచ్ఎంసి అధికారులమని చెప్తూ వసూళ్లకు పాల్పడుతుంది.

**ఆశ్చర్యం కలిగించే సంఘటన..**

ఎల్బీనగర్ హయత్ నగర్ సర్కిల్ 3 పరిధిలోనీ వనస్థలిపురం డివిజన్ శ్రీనివాస కాలనీ లో ఓ నిర్మాణదారుడు ఇంటి నిర్మాణాన్ని చేపట్టాడు. అయితే.. ఓ వ్యక్తి సదురు నిర్మాణదారుడికి నీది అక్రమ నిర్మాణం తాము జిహెచ్ఎంసి నుండి వచ్చావని ఫోన్ చేసి భయపెట్టాడు. నీ నిర్మాణం జరగాలంటే తాను చెప్పిన నెంబర్ కి ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించాలని హుకుం జారీ చేశాడు. దీంతో భయపడ్డ సదురు నిర్మాణదారుడు రూ.26,500/ ఓసారి.. రూ 6,000/ లను ఓసారి ట్రాన్స్ఫర్ చేశాడు. ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల్లోనే సంచరిస్తున్నాడని స్థానికులు అనుమానిస్తున్నారు.

**బల్దియా అధికారులపై అనుమానాలు..!**

ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఉన్న అన్ని సర్కిళ్లలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఈ అక్రమ నిర్మాణదారుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు కొత్త ఎత్తుగడ వేసారనే అనుమానాలు కలుగుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులే ప్రైవేట్ వ్యక్తులను నియమించుకొని అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో ఏసీబీ దాడులు పెరిగిపోవడంతో జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులే ఓ ప్రైవేట్ బ్యాచ్ ఏర్పాటు చేసుకున్నట్లు కూడా వార్తలు గుప్పుమంటున్నాయి. ఇలాంటి బ్యాచ్ ని ఏర్పాటు చేసుకొని అక్రమ నిర్మాణదారుల నుంచి వసూలు చేస్తున్నట్లు విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. దీనిపై జిహెచ్ఎంసి విజిలెన్స్ అధికారులు, ఏసీబీ అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఈసీ మెంబర్‌గా బాధ్యతలు స్వీకరించిన అశోక్ దయ్యాల



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించింది. నూతన కమిటీ సభ్యులతో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా అశోక్ దయ్యాల బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు అశోక్ దయ్యాలకు రిటర్నింగ్ ఆఫీసర్స్ దొడ్డ శ్రీనివాస్ రెడ్డి , కొండ శ్రీనివాస్ గార్లు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గోపరాజు ఆధ్వర్యంలో నూతన కమిటీని సత్కరించారు. దేవులపల్లి అమర్, సీనియర్ జర్నలిస్టులు కొత్త కమిటీకి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. మరో వైపు ఈసీమెంబర్ గా నియామక పత్రం అందుకున్న అశోక్ దయ్యాలను ఎఎన్ఎన్ సీఈఓ కంది రామచంద్రారెడ్డి , ఎఎన్ఎన్



బ్యూరో చీఫ్ కృష్ణమూర్తి గడ్డం , ఎఎన్ఎన్ జనరల్ మేనేజర్ అరవింద్ రెడ్డి మందడి అభినందించారు..

## రాష్ట్ర చరిత్రలో నిలిచేలా ప్రజా విజయోత్సవాలు

**ప్రజా విజయోత్సవాల కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి**



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రైజింగ్ తో పాటు తెలంగాణ ఆవిర్భావం, అభివృద్ధి అంశాలు కలగలిపి ఒక సమగ్ర ప్రణాళికతో ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ప్రజా పాలన విజయోత్సవాల నిర్వహణపై ప్రభుత్వ సలహాదారు కే కేశవరావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావం ఎలా సాధించాం, కొత్త రాష్ట్రంలో ఎన్ని విజయాలు నమోదు చేశాం, భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం ఏం సాధించబోతుంది అనే విషయాలను ప్రపంచానికి వివరించే విధంగా కార్యక్రమాలు ఉండాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. పెట్టుబడిదారులను ఈ విజయోత్సవానికి ఆహ్వానిస్తున్నాం, పెద్ద ఎత్తున ఎంఓయూలు జరిగేలా వాతావరణం ఉండాలి అన్నారు. దుబాయ్ ఫెస్టివల్ పూర్తిగా దుబాయ్ పట్టణానికి దూరంగా జరుగుతుంది అదే పద్ధతిలో మన రాష్ట్రంలోనూ ఫ్యూచర్ సిటీలో కొన్ని ప్రదర్శనలు ఏర్పాటు చేసేందుకు అధికారులు ఆలోచన చేయాలని డిప్యూటీ సీఎం అన్నారు. సీనియర్, జూనియర్ అధికారులతో కలిపి కమిటీలు వేయాలని ప్రణాళిక ప్రకారం పనులు విభజించుకుని నాణ్యతతో సకాలంలో అనుకున్న ప్రణాళికను అమలు చేసేలా ముందుకు వెళ్లాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరం, తెలంగాణ రాష్ట్రం, మూసి పునర్జీవనం, ఫ్యూచర్ సిటీ, ఇప్పటికే అనేక పరిశ్రమలను తెలంగాణ ఆకర్షిస్తుంది, భవిష్యత్తు తెలంగాణ ఎలా ఉండబోతుందో ఈ వేడుకల్లో ప్రపంచానికి చూపించే విధంగా ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ రావు, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా , వివిధ విభాగాల కార్యదర్శులు, సమాచార పౌర సంబంధాల కమిషనర్ ప్రియాంక, సీనియర్ ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు.

# నిందితుడిని వదిలేసేందుకు రూ.2 కోట్లు

**టాస్క్ ఫోర్స్ ఎస్ఐ నిర్వాకం.. సస్పెండ్ చేసిన సీపీ సజ్జనార్**

**పై అధికారుల హస్తం ఉందన్న అనుమానాలు**

**హైదరాబాద్, మహా :** అధిక వడ్డీ ఆశ చూపి జనాల వద్ద నుంచి భారీ మొత్తంలో నగదు రాబట్టి.. ఆ తర్వాత ముఖం చాటేసిన నిందితుడిని అరెస్ట్ చేయాల్సిన పోలీసు అధికారే.. నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అతడి వద్ద నుంచి రూ.2 కోట్లు తీసుకుని ఆర్థిక మోసగాడిని వదిలేశారు. ఇది కాస్త ఉన్నతాధికారులకు తెలియడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ జరుపగా సదరు ఎస్ఐ నేరస్తుడి నుంచి రూ. 2 కోట్లు తీసుకుని వదిలేశాడని తేలింది. దీంతో ఎస్ఐని సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ ఉత్తర్వుల జారీ చేశారు. ఎస్ఐ శ్రీకాంత్.. సదాశివపేట దగ్గర ఆర్థిక నేరస్తుడిని తప్పించారు. అందుకు గాను అతడి వద్ద నుంచి రూ.2 కోట్లు తీసుకున్నాడు. ఆర్థిక నేరస్తుడైన ఉప్పలపాటి సతీష్ ముంబైలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఒక బృందం అక్కడకు వెళ్లింది. సతీష్‌ను అరెస్ట్ చేసి ముంబై నుంచి హైదరాబాద్ తీసుకువస్తుండగా అతడు పరారయ్యాడు. సతీష్ పరారీ అయ్యేందుకు సహకరించడంతో శ్రీకాంత్ గౌడ్ సస్పెన్షన్‌కు గురయ్యారు. సతీష్‌ను అదుపులోకి తీసుకోవడం దగ్గర నుంచి అతడు పారిపోవడానికి సహకరించడం వరకు ఇలా ప్రతి అంశంలో కూడా ఎస్ఐ శ్రీకాంత్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. ముంబైలో సతీష్ ఆచూకీ కనిపెట్టిన టాస్క్ ఫోర్స్ పోలీసులు అతడిని అరెస్ట్ చేయడం కోసం ఎస్ఐ శ్రీకాంత్‌తో పాటు మరి కొందరు సిబ్బందిని గత గురువారం అక్కడకు పంపారు. గత గురువారం రాత్రి అనగా అక్టోబర్ 23వ తేదీ సతీష్‌తో పాటు అతడి భార్య, కుమార్తెను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలానే వారి వద్ద నుంచి 8 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అయితే సాధారణంగా ఇలాంటి కేసుల్లో నిందితుల్ని పోలీసులు తమ వాహనంలోనే తరలిస్తారు. వారి చేతికి ఫోన్లు అందనీయరు. కానీ ఈ కేసులో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ శ్రీకాంత్ మాత్రం పోలీసులు ఉన్న కారు కాకుండా నిందితులతో కలిసి వాళ్ల కారు ఎక్కారు. పైగా వారితో డీల్ మాట్లాడుకుని డబ్బులు ఏర్పాటు చేయడం కోసం నిందితులకు మొబైల్ కూడా ఇచ్చారు. మరో ఆశ్చర్యకరమైన అంశం ఏంటంటే వీరి వాహనాన్ని నిందితుడి డ్రైవరే నడిపారు.

నిందితులది ఎస్‌యూవీ కాగా పోలీసులది పాత ఇన్నోవా. దీంతో ఈ రెండు వెహికల్స్ మధ్య దూరం దాదాపు 40 కి.మీలకు చేరింది. ఎస్ఐ, నిందితులు కలిసి ప్రయాణం చేస్తోన్న వాహనం సదాశివపేట్ చేరడానికి 2 గంటల ముందే అక్కడకు మరో కార్ వచ్చి రెడీగా ఉంది. ఇక శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఎస్ఐ, ఇతరులు ప్రయాణిస్తున్న వెహికల్ సదాశివపేట్‌లోని ఓ దాబా వద్దకు చేరింది. అప్పటికే అక్కడికి నిందితులకు సంబంధించిన కారు వచ్చి ఉంది. దాబా వద్ద కార్ ఆగగానే నిందితులు తమ కోసం వచ్చిన వెహికల్ ఎక్కి కొల్హాపూర్ వైపు పారిపోయారు. ఇది జరిగిన కొద్దిసేపటికి వెనుక వస్తున్న తన బృందానికి నిందితులు పారిపోయినట్లు ఎస్ఐ సమాచారం ఇచ్చారు. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో సదరు ఎస్ఐ అక్కడే ఉండిపోవడమో లేదంటే సీసీ కెమెరాల ఆధారంగా నిందితులు వెళ్లిన దారిలో వెళ్లి వారిని గాలించడమో చేయాలి. కానీ ఇక్కడ ఎస్ఐ శ్రీకాంత్ మాత్రం నిందుతుడి కారులో అతడి డ్రైవర్‌తో కలిసి హైదరాబాద్ పయనమయ్యారు. వారు బయలుదేరిన కాసేపటికి ఇతర సిబ్బంది దాబా వద్దకు చేరుకుని ఎస్ఐకి కాల్ చేయగా నిందితులు పారిపోయారని తాను హైదరాబాద్ వెళ్తున్నానని చెప్పాడు. అలా సిటీకి వచ్చేసిన సదరు ఎస్ఐ ఎక్కడెక్కడకు వెళ్లారు.. ఎవరిని కలిశారు వంటి తదితర అంశాలను ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఈఎస్ఐతో పాటు సతీష్ కుటుంబీకులు ప్రయాణించిన కారు డ్రైవర్‌ను పోలీసులు ప్రశ్నించారు. మొత్తంగా శ్రీకాంత్ తప్పిదం పూర్తిగా ఉందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిన సీపీ అతడిని సస్పెండ్ చేసి పూర్తి స్థాయి విచారణకు ఆదేశించారు. శ్రీకాంత్ వ్యవహారం వెనుక పై అధికారుల హస్తం ఉండవచ్చన్న అనుమానాలు రావడంతో లోతైన దర్యాప్తు జరపాలని ఆదేశించిన సీపీ దర్యాప్తు అంశాలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు.

## ఖమ్మం జిల్లాలో సీపీఎం నేత దారుణ హత్య

**చింతకాని, మహా :** ఖమ్మం జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. సీపీఎం నేత, రైతు సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి సామినేని రామారావును దుండగులు హతమార్చారు. చింతకాని మండలం పాతర్లపాడులో ఈ ఘటన చోటు చేసుకుంది. శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన ఆయన్ను కత్తులతో పొడిచి చంపేశారు. రామారావు రెండుసార్లు రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శిగా, పాతర్లపాడు సర్పంచ్‌గా పనిచేశారు. ఖమ్మం సీపీ సునీల్ దత్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పోతినేని సుదర్శన్, పొన్నం వెంకటేశ్వరరావుతో పాటు పలువురు నేతలు రామారావు కుటుంబాన్ని పరామర్శించారు. మరోవైపు పాతర్లపాడులో పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**రాష్ట్రంలో హింసా రాజకీయాలకు తావు లేదు: భట్టి విక్రమార్క**

సామినేని రామారావు హత్యపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాష్ట్రంలో హింసా రాజకీయాలకు తావులేదని.. దోషులను వెంటాడి, వేటాడి చట్టపరంగా శిక్షిస్తామని చెప్పారు.

# టీమిండియా కెప్టెన్ 2 స్టేట్ మినిస్టర్

## అజారుద్దీన్ జైత్రయాత్ర

క్రికెట్ అయినా పాలిటిక్స్ అయినా..
అనుకున్నది సాధించిన అసామాన్యుడు

**మహా :** మణికట్టు మాంత్రికుడిగా క్రికెట్ లో అజర్ కు స్పెషల్ పేరు. క్రికెట్ గ్రౌండ్ లో ప్రత్యర్థి దేశాలను గడగడలాడించిన అజారుద్దీన్.. ఇపుడు పొలిటికల్ గ్రౌండ్ లోనూ సైలెంట్ గా అనుకున్నది సాధించాడు. గల్లీ క్రికెట్ బ్యాట్ నుంచి మంత్రిదాకా... ఇదే టీం ఇండియా మాజీ కెప్టెన్ మొహమ్మద్ అజారుద్దీన్ అద్భుత ప్రయాణం. క్రికెట్ మైదానంలో స్టైలిష్ షాట్లతో అభిమానులను మంత్ర ముగ్ధులను చేసిన అజారుద్దీన్ ఇప్పుడు రాజకీయ రంగంలో కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించాడు. ఎన్నో విజయాలు, వివాదాలు, వ్యక్తిగత ఒడిదుడుకులు ఎదుర్కొంటూ చివరకు తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అజార్ భాయ్ మరోసారి అందరి దృష్టిని ఆకర్షించారు.

**అజార్ భాయ్**

టీం ఇండియా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్‌గా పేరు ప్రఖ్యాతులు సంపాదించిన ముహమ్మద్ అజారుద్దీన్ బాల్య దశలో హైదరాబాద్ నగరంలోని గల్లీ క్రికెట్ నుంచి తన క్రీడా ప్రస్థానాన్ని ఆరంభించారు. ఇటు క్రికెట్ రంగంలోనూ అటు వ్యక్తిగత జీవితంలోనూ ఎన్నెన్నో వివాదాలను చవి చూసిన అజారుద్దీన్ ను హైదరాబాదీలు అజార్ భాయ్ అని ప్రేమగా పిలుస్తుంటారు. బెట్టింగ్ ఆరోపణలపై సస్పెన్షన్ వేటు పడటంతో క్రికెట్ రంగానికి గుడ్ బై చెప్పిన అజార్ అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీలో చేరిక ద్వారా రాజకీయాల్లోకి రంగప్రవేశం చేశారు. నాడు యూపీలోని మొరాదాబాద్ లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగి విజయఢంకా మోగించి పార్లమెంటులోకి అడుగు పెట్టారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఓటమి పాలైనా గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకం కోసం రాష్ట్ర ప్రభుత్వం అజారుద్దీన్ పేరును గవర్నరుకు సిఫార్సు చేసింది. ఎమ్మెల్సీ ఎంపిక వ్యవహారం గవర్నర్ వద్ద పెండింగులో ఉండగానే అనూహ్యంగా అజారుద్దీన్ తెలంగాణ కేబినెట్ మంత్రిగా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు.

**ఇదీ అజారుద్దీన్ ప్రస్థానం**

హైదరాబాద్ నగరానికి చెందిన మహమ్మద్ అజీజుద్దీన్, యూసఫ్ సుల్తానా దంపతులకు అజారుద్దీన్ 1963 ఫిబ్రవరి 8 వతేదీన జన్మించాడు. ఈయన ఆబిడ్స్ లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్ లో పాఠశాల విద్య పూర్తి చేశారు. ఆ తర్వాత క్రికెట్ పై మక్కువతో గల్లీల్లో క్రికెట్ ఆడుతూ నిజాం కళాశాల నుంచి బికాం డిగ్రీ పట్టా పుచ్చుకున్నారు.

**టీం ఇండియా కెప్టెన్ గా**

గల్లీ క్రికెట్ ఆడుతూనే టీంఇండియాలో స్థానం సంపాదించాడు. ఇంటర్‌యూనివర్శిటీ టోర్నమెంట్లలో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహించాడు. ఆంధ్రతో జరిగిన రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో సెంచరీలు సాధించాడు. అజార్ తన మొదటి మూడు టెస్ట్ మ్యాచ్‌లలో ప్రతిదానిలోనూ సెంచరీలు సాధించడం ద్వారా సంచలనం సృష్టించాడు తరువాత 1989లో భారత జట్టుకు నాయకత్వం వహించాడు. 16 సంవత్సరాల క్రికెట్ కెరీర్‌లో అజారుద్దీన్ భారతదేశం తరపున 99 టెస్టులు, 334 వన్డే ఇంటర్నేషనల్స్ ఆడాడు. అతని కాలంలో అత్యంత స్టైలిష్ బ్యాట్స్‌మెన్‌లలో ఒకడు అయ్యాడు. కుడిచేతి వాటం మిడిల్ ఆర్డర్ బ్యాటర్ గా, మీడియం ఫాస్ట్ బౌలరుగా అజార్ 99 టెస్ట్ మ్యాచ్ లు, 334 వన్డే ఇంటర్నేషనల్స్ మ్యాచ్ లు ఆడారు.



టీం ఇండియా కెప్టెన్ గా 1990 91, 1995 ఆసియా కప్ లలో జట్టుకు విజయం చేకూర్చారు. 1996 క్రికెట్ ప్రపంచ కప్‌లో సెమీ ఫైనల్‌కు జట్టును చేర్చాడు. ఇతను ప్రపంచంలోని అత్యుత్తమ వన్డే బ్యాట్స్‌మెన్‌లలో ఒకరిగా నిలిచారు. 1990లలో భారతదేశానికి మూడు క్రికెట్ ప్రపంచ కప్‌లకు నాయకత్వం వహించాడు. 1985 ప్రపంచ క్రికెట్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్న భారత జట్టులో అజార్ ఒకరు.

**మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు**

2000 వ సంవత్సరంలో అజార్ దక్షిణాఫ్రికా కెప్టెన్ హ్యాన్సీ కోన్జేకి బుకీలను పరిచయం చేశారని సీబీఐ తన నివేదికలో ఆరోపించింది. సీబీఐ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఐసీసీ, బీసీసీఐ అజారుద్దీన్ ను జీవితకాలం క్రికెట్ ఆడకుండా నిషేధించాయి. దీంతో 2000 వ సంవత్సరంలో అజార్ క్రికెట్ ప్రస్థానం ముగిసింది. అయితే 2012వ సంవత్సరంలో హైదరాబాద్ డివిజనల్ కోర్టు న్యాయమూర్తులు అశుతోష్ మొహంతా, కృష్ణ మోహన్ రెడ్డిలు అజార్ పై విధించిన నిషేధం అక్రమమని తీర్పు చెప్పారు. నిషేధం తర్వాత అజార్ క్రికెట్ మైదానంలోకి అడుగు పెట్టలేదు. కోర్టు తీర్పు తర్వాత ఇటీవల జమ్మూ కశ్మీరులో యువకులకు క్రికెట్ నేర్పారు.

**హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా**

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అజార్ పై జీవిత కాల నిషేధం ఎత్తివేశాక 2019వ సంవత్సరం సెప్టెంబరు 4 వ తేదీన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఐపీఎల్ మ్యాచ్ టికెట్ల కుంభకోణం లోనూ అజార్ పై అరోపణలు వచ్చాయి. ఆ తర్వాత హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వైదొలిగిన అజార్ ఏకంగా మంత్రి అయ్యారు.

**బాలీవుడ్ నటి సంగీతా బిజ్లానీతో వివాహం**

భార్య నౌరీన్ కు విడాకులిచ్చిన అజార్ బాలీవుడ్ ప్రముఖ సినీ నటి సంగీతా బిజ్లానీని వివాహమాడారు. అజార్ పై పలు పుకార్లు రావడంతో ఆమె రెండో భార్య సంగీతా బిజ్లానీ 2010వ సంవత్సరంలో అతనికి విడాకులిచ్చి తన స్వస్థలమైన ముంబయికు వెళ్లిపోయారు.

**భార్య నౌరీన్ కు విడాకులు**

మొహమ్మద్ అజారుద్దీన్ క్రికెట్ రంగంలోనే కాకుండా వ్యక్తిగత జీవితంలోనూ పలు ఒడిదుడుకులు ఎదుర్కొన్నాడు. ఈయన 1987వ సంవత్సరంలో హైదరాబాద్ కు చెందిన నౌరీన్ ను వివాహం చేసుకున్నాడు. వారికి మొహమ్మద్ అసదుద్దీన్, మొహమ్మద్ అయాజుద్దీన్ లు అనే ఇద్దరు కుమారులు. ఇద్దరు పిల్లలు పుట్టాక అజార్ 1996 వ సంవత్సరంలో తన భార్య నౌరీన్ కు విడాకులు ఇచ్చాడు. అతని చిన్న కుమారుడు అయాజుద్దీన్ 2011 సెప్టెంబరు 11వ తేదీన ఔటర్ రింగ్ రోడ్డుపై పుప్పాల గూడ వద్ద బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మరణించాడు.

**సానియా మీర్జా కుటుంబంతో అజారుద్దీన్ వియ్యం**

మాజీ క్రికెట్ కెప్టెన్ అయిన నేటి మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్, మాజీ టెన్నిస్ స్టార్ సానియామీర్జా కుటుంబంతో వియ్యం అందుకున్నారు. అజారుద్దీన్ కుమారుడు మొహమ్మద్ అసదుద్దీన్ సానియా మీర్జా చెల్లెలు ఆనం మీర్జాతో వివాహం జరిగింది. ఆనం మీర్జాకు అసద్ తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారడంతో అజార్, సానియా కుటుంబాలు వారిద్దరికీ వివాహం జరిపించారు. ఈ పెళ్లితో హైదరాబాద్ నగరానికి చెందిన క్రికెట్ మాజీ కెప్టెన్ అజార్, మాజీ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా కుటుంబాల మధ్య బంధుత్వం ఏర్పడింది.

**క్రికెట్ నుంచి రాజకీయాల్లోకి...**

క్రికెట్ నుంచి నిషేధానికి గురైన అజారుద్దీన్ 2009 ఫిబ్రవరి 19వతేదీన రాజకీయాల్లోకి ప్రవేశించి, కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదే సంవత్సరం ఆయన ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి 40,107 ఓట్ల ఆధిక్యతతో లోక్‌సభకు ఎన్నికయ్యారు. అయితే ఆ తర్వాత 2014 లోక్‌సభ ఎన్నికల్లో రాజస్థాన్‌లోని టోంక్ సవాయి మాధోపూర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి బీజేపీ అభ్యర్థి సుఖ్‌బీర్ సింగ్ జౌనపురియా చేతిలో 1,35,506 ఓట్ల తేడాతో ఓడిపోయాడు. క్రికెట్ రంగంలోనూ, వ్యక్తిగత జీవితంతోపాటు రాజకీయ రంగంలోనూ వివాదాస్పదుడిగా అజార్ నిలిచారు.

**ఎమ్మెల్యేగా ఓడిపోయి**

మహమ్మద్ అజహరుద్దీన్ 2019 లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉన్నారు. 2018లో కాంగ్రెస్ ఆయనను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించింది. దీంతో తన సొంత రాష్ట్రమైన తెలంగాణ రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. ఆ తర్వాత 2023 తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించిన రెండో జాబితాలో ఆయనను జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించింది. ఈ ఎన్నికలలో తన సమీప ప్రత్యర్థి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి గోపినాథ్ చేతిలో 16,337 ఓట్ల తేడాతో ఓడిపోయాడు.

**ముస్లిం సామాజిక వర్గంలో సంతోషం**

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో ఆలస్యంగానైనా ముస్లిం మైనారిటీ అయిన అజారుద్దీన్ కు స్థానం కల్పించడం పట్ల ముస్లింలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముస్లిం మంత్రి ఆధ్వర్యంలో మైనారిటీ సంక్షేమ పథకాలను ముమ్మరం చేయాలని సూచించారు. అజారుద్దీన్ కు మంత్రి పదవి పోకుండా గవర్నర్ కోటా ఎమ్మెల్సీని సకాలంలో ఇప్పించేలా కాంగ్రెస్ నేతలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**అమాత్య పదవి వరించింది**

కీలకమైన జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు ముందు అజారుద్దీన్ ను మంత్రి పదవి వరించింది. నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్న ముస్లిం ఓటర్లలో కాంగ్రెస్ ఆకర్షణను పెంచే ప్రయత్నంలో భాగంగా అజార్ కు అమాత్య పదవి వరించిందని కాంగ్రెస్ పార్టీకి చెందిన 23 నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో మైనారిటీ ప్రాతినిధ్యం లేకపోవడం, హైదరాబాద్ జిల్లా నుంచి మంత్రి లేకపోవడం అనే రెండు ప్రధాన సమస్యలను పరిష్కరించే వ్యూహాత్మక రాజకీయ నిర్ణయంగా అజారుద్దీన్ ను మంత్రివర్గంలోకి తీసుకున్నారని భావిస్తున్నారు.

**మైనార్టీ ఓట్ల కోసమే : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

మైనార్టీ ఓట్ల కోసమే ఎమ్మెల్యే కాని అజారుద్దీన్‌ని కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రిని చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు కాంగ్రెస్ మంత్రి వర్గాన్ని విస్తరించడంపై ప్రజలు ఆలోచించాలన్నారు. అజారుద్దీన్ పై కేసులుంటే ఎలా మంత్రిని చేస్తారని ఆయన ప్రశ్నించారు.

**ఆరోపణలు పట్టించుకోను : అజారుద్దీన్**

తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అజారుద్దీన్ మొదటి సారి మీడియాతో మాట్లాడారు. తనపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు మాత్రమేనని, అవి వాస్తవం కాదని అజారుద్దీన్ చెప్పారు. తనపై నమోదైన ఒక్క కేసు కూడా నేరం రుజువు కాలేదని ఆయన పేర్కొన్నారు. తనకు మంత్రిగా అవకాశం కల్పించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిగా తనకు ఏ శాఖ అప్పగించినా సమర్థవంతంగా పనిచేస్తానని చెప్పారు.



## అజారుద్దీన్ ఇంటి వద్ద అభిమానుల సందడి

టీం ఇండియా మాజీ కెప్టెన్ ముహ్మద్ అజారుద్దీన్ శుక్రవారం తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో ఆయన అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం నేతలు ఆయన ఇంటికి తరలివచ్చారు. పలువురు అభిమానులు శాలువలు కప్పి, స్వీట్లు తినిపించి అజార్ భాయ్ కంగ్రాచ్యు లేషన్స్ అంటూ నినాదాలు చేశారు. కొందరు అభిమానులైతే పుష్పగుచ్ఛాలు అందజేసి, పండ్ల బుట్టలను బహుమతిగా అందించి అభినందించారు.

## మంత్రిగా తెలంగాణ అభివృద్ధికి బ్యాటింగ్ చేసేనా?

గల్లీ క్రికెట్ నుంచి టీం ఇండియా కెప్టెన్‌గా, అక్కడి నుంచి రాజకీయ రంగంలోని కీలక మంత్రిగా అజారుద్దీన్ ప్రయాణం నిజంగా అసాధారణం. ఆటగాడిగా అభిమానుల హృదయాలను గెలుచుకున్న అజార్, ఇప్పుడు ప్రజాసేవలో కొత్త పుటను ప్రారంభించారు. ఎన్నో ఆరోపణలు, ఎత్తుపల్లాలు, వ్యక్తిగత నష్టాలు ఎదుర్కొన్నప్పటికీ ఆయన తిరిగి నిలబడగలిగాడు. క్రీడలోనూ, రాజకీయాల్లోనూ తన ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్న అజార్ భాయ్ ఇప్పుడు మంత్రిగా తెలంగాణ అభివృద్ధికి బ్యాటింగ్ చేయడానికి సిద్ధమవుతున్నారు.



# మేయర్ పై సమ్మయ్య నగర్ జనం తిరుగుబాటు

## ఫొటోల కోసమే తప్ప జనం సమస్యలు తీర్చారా అంటూ నిలదీత

**హన్మకొండ మహా;** సీఎం పర్యటనకు ముందు బల్దియా పరిధిలోని హనుమకొండ జిల్లా సమ్మయ్య నగర్ లో నగర మేయర్ గుండు సుధారాణి పై స్థానికులు తిరగబడ్డారు. ఈ వీడియో కాస్త సోషల్ మీడియాలో చక్కెరలు కొడుతుంది. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ముందస్తుగా గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి సమ్మయ్య నగర్ లో మేయర్ పర్యటించారు. సమ్మయ్య నగర్ చేరుకున్న నగర మేయర్ ను స్థానికులు ఫొటోల కోసం తప్ప, మా సమస్యలు ఏనాడైనా తీర్చారా అంటూ మండిపడ్డారు. గత 15 సంవత్సరాలుగా ప్రతి ఏడు వర్షాలు కురవడం, వరద ప్రభావంతో కాలనీలు నీట మునగడం పరిపాటిగా మారిందని అభివృద్ధి పనులు సకాలంలో వేగవంతంగా పూర్తి చేయకపోవడమే ఇందుకు కారణమని స్థానికులు మండిపడ్డారు. ముంపుకు గురైన ప్రతిసారీ కోట్ల రూపాయలు విడుదల చేస్తున్నామంటూ ప్రభుత్వం చెప్పడం తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కోట్ల నిధులు ఎక్కడ పోతున్నాయంటూ నిలదీశారు. ముంపు నివారణకు శాశ్వత పరిష్కారం దొరకడం లేదా అంటూ స్థానికులు ఆగ్రహించారు. దీంతో వారికి సమాదానం చెప్పకుండానే మేయర్ తో పాటు కమీషనర్ అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయారు.



# మనమందరం మన దేశం కోసం

## రన్ ఫర్ యూనిటి కార్యక్రమంలో బిజెపి జిల్లా నేతలు

**వరంగల్ మహా;** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా రన్ ఫర్ యూనిటీ జంక్షన్ కార్యక్రమంలో భాగంగా బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవి కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఆధ్వర్యంలో బిజెపి జిల్లా నేతలు, నాయకులు, కార్యకర్తలతో కలిసి వరంగల్ తూర్పు నియోజకవర్గంలోనీ పోచమ్మ మైదాన్ జంక్షన్ నుండి వెంకటరమణ థియేటర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం మెడలు వంచి, రజాకార్ల ను తరిమికొట్టి, స్వతంత్ర భారతదేశంలో తెలంగాణ ను ఐక్యం చేసిన ధీరోద్ధాత్తుడు, ఉక్కు మనిషి, భారతదేశ తొలి హోం మంత్రి, మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతిని పురస్కరించు కొని వరంగల్ జిల్లా నుండి వారికి ఘన నివాళులు అర్పించారు. తదనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సర్దార్ @150 ప్రోగ్రాం కన్వీనర్ ఎరుకుల రఘునారెడ్డి, ఎర్రగొల్ల భరత్ వీర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, డాక్టర్ వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, బిజెపి సీనియర్ నాయకులు, బీజేవైఎం కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




# రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను పరామర్శించిన సీపీ

**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా ముల్కనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందులో ముగ్గురు మరణించగా ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా వారిని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ స్వయంగా ఎంజీఎం ఆసుపత్రికి వెళ్లి గాయపడిన క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరు పై పోలీస్ కమిషనర్ సంబంధిత అధికారులతో పాటు క్షతగాత్రులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గాయపడిన క్షతగాత్రులకు అందిస్తున్న చికిత్స వివరాలను కూడా పోలీస్ కమిషనర్ సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట ఏసిపి ప్రశాంత్ రెడ్డి, పోలీస్ అధికారులు, ఇన్స్పెక్టర్ పులి రమేష్, తదితరులు ఉన్నారు.



# జాతీయ సమైక్యతకు నిలువెత్తు నిదర్శనం సర్దార్ వల్లభభాయ్ పటేల్

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** జాతీయ సమైక్యతకు నిలువెత్తు నిదర్శనం సర్దార్ వల్లభభాయ్ పటేల్ అని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కొనియాడారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవం శుక్రవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి ఐ.బి. చౌరస్తా వరకు నిర్వహించిన రన్ ఫర్ యూనిటీ 2కె రన్ కార్యక్రమానికి డి.సి.పి. ఎ భాస్కర్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, జిల్లా క్రీడా యువజన సర్వీసుల అధికారి హనుమంతరావు లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ ప్రజలందరినీ ఐక్యం చేస్తూ జాతీయ సమైక్యతకు కృషి చేసిన మహనీయుడు సర్దార్ వల్లభభాయ్ పటేల్ అని అన్నారు. కుల, మత, వర్గ, వర్ణ, ప్రాంతీయ, సాంస్కృతిక విభేదాలు లేకుండా ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చారని కొనియాడారు. భారతదేశ మొదటి ఉప ప్రధానమంత్రిగా దేశానికి విశిష్ట సేవలు అందించారని తెలిపారు. భారత స్వతంత్రం అనంతరం దాదాపు 530 రాష్ట్రాలను భారతదేశంలో విలీనం చేశారని వెల్లడించారు. పౌర హక్కులు, రైతు ప్రయోజనాల కోసం ఎంతగానో కృషి చేశారని చెప్పారు. ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగితే రాష్ట్రం, దేశ అభివృద్ధి సాధ్యపడుతుందని, దేశభక్తి, సమైక్యత భావం ప్రతి ఒక్కరిలో ఉండాలని సూచించారు. ప్రజల సంక్షేమం, దేశ అభివృద్ధికి కృషిచేసిన మహనీయుల ఆశయాలను యువత సమిష్టిగా ముందుకు తీసుకు వెళ్లాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# పత్తి కొనుగోలు ప్రక్రియలో పొరపాట్లు దొర్లకుండా చూడాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**తాండూర్ / మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో పత్తి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా చూడాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం జిల్లాలోని తాండూర్ మండలంలోని మహేశ్వరి కాటన్స్, శ్రీరామా జిన్నింగ్ ప్రెస్సింగ్ యూనిట్ లను మండల తహసిల్దార్ జ్యోత్స్న తో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం సి సి ఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేస్తుందని ఆయన తెలిపారు. 2025 26 సంవత్సరంలో మద్దతు ధర క్రింద సి.సి.ఐ. కు పత్తి విక్రయించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన కపాస్ కిసాన్ యాప్ లో రైతులు తమ వివరాలు నమోదు చేసుకుని, పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆయన సూచించారు. నిబంధనల ప్రకారం పత్తిలో తేమ శాతం, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేయాలని సూచించారు. ఆధార్ నంబర్ కు అనుసంధానం చేయబడిన బ్యాంకు ఖాతాలో మాత్రమే చెల్లింపులు జరుగుతాయని వివరించారు. ఆధార్ కార్డులో ఫోటో కలిగి ఉన్న రైతు మాత్రమే తక్పట్టిలో ఫోటో దిగవలసి ఉంటుందని తెలిపారు. దళారులు కొనుగోలు చేసిన పత్తిని కొనుగోలు కేంద్రాలలోనికి అనుమతించకూడదని అధికారులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సంబంధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ జీవితం అందరికీ ఆదర్శప్రాయం

## ఇందిరా గాంధీ విగ్రహానికి ఘన నివాళులు అర్పించిన మంత్రి కొండా సురేఖ

**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం కాశిబుగ్గ లో శుక్రవారం భారతదేశ తొలి మహిళా ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి మంత్రి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఇందిరమ్మ జీవితం యావత్ భారతీయులందరికీ ఆదర్శప్రాయమని దేశ ఐక్యత కోసం ప్రాణాలర్పించిన ధీరవనిత అని గరిబీ హఠావో అనే నినాదంతో దేశంలోని ప్రతి పేద వాడి కడుపు నింపి... ఆకలి తీర్చిన గొప్ప నాయకురాలు స్వర్గీయ ఇందిరా గాంధీ అని చెప్పారు. భారతదేశపు కీర్తిని ప్రపంచం నలుమూలలా చాటిచెప్పిన ఉక్కు మహిళ ఇందిరమ్మ అని స్పష్టం చేశారు. ఆ మహనీయురాలు రాజకీయ, వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని శక్తిమంతమైన నాయకురాలిగా భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే స్థాయికి ఆమె ఎదిగిన తీరు మనకి ఎంతగానో స్ఫూర్తిదాయకమన్నారు. ఇందిరమ్మ ఈ దేశానికి అందించిన సేవలు నాటితరం నాయకులకే కాదు నేటితరం నాయకులకు సైతం ఆచరణీయమన్నారు. తాను తన రాజకీయ జీవితంలో ప్రతి సందర్భంలోనూ... ఇందిరమ్మను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్ళినట్టు వివరించారు. 1964లో ఆమె తండ్రి, భారత తొలి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ మరణం అనంతరం ఇందిరా గాంధీ రాజ్యసభకు ఎన్నికై... లాల్ బహదూర్ శాస్త్రి మంత్రిమండలిలో ప్రసారశాఖ మంత్రిగా ఆమె విశిష్ట సేవలు అందించారన్నారు. అనంతరం దేశంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో 1966లో మొదటిసారి ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించి దేశ మొదటి మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీ చరిత్ర సృష్టించారన్నారు. బ్యాంకుల జాతీయకరణ, జమీందారీ వ్యవస్థ రద్దు, రాజ భరణాల తొలగింపు వంటి గొప్ప విప్లవాత్మక పథకాలతో భారతదేశ అత్యున్నత ప్రధానమంత్రిగా నిరూపించుకున్నారన్నారు. ఈ దేశ ప్రజలు ఆర్థికంగా బాగుపడాలని పడాలని ఎన్నో మంచి పనులు చేయడంతో... ఆమెను ఆనాడు దేశ ప్రజలంతా ఇందిరానే ఇండియా అంటూ కీర్తించారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలకు స్ఫూర్తినిచ్చే నాయకురాలిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

### మంచిర్యాల జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో నవంబర్ 1 నుండి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించనున్న యు.డి.ఐ.డి./ సదరం క్యాంపును దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 1, 3, 4, 6, 7, 10, 11, 12, 13, 14 తేదీలలో లోకో మోటార్/ఆర్థో, 17, 18 తేదీలలో వినికిడి లోపం సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గతంలో మీసేవ కేంద్రాలలో అక్టోబర్ 20వ తేదీ వరకు నూతనంగా నమోదు చేసుకున్న లోకో మోటార్/ఆర్థో, వినికిడి లోపం అభ్యర్థులు సంబంధిత పత్రాల తో సకాలంలో హాజరు కావాలని తెలిపారు.




# బెల్లంపల్లిలో ఘనంగా సర్దార్ వల్లభాయ్ జయంతి వేడుకలు

- సర్దార్ వల్లభాయ్ పటేల్ ను ఆదర్శంగా తీసుకుందాం
- బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్

**బెల్లంపల్లి,మహ:** భారతదేశ ఉక్కుమనిషి, కేంద్ర మొట్టమొదటి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ను స్ఫూర్తిగా తీసుకొని అందరం ఐకమత్యంతో ముందుకు సాగుదామని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ పిలుపునిచ్చారు.ఇ శుక్రవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, యూనిట్ 2 ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల కంప్యూటర్ల్యాబ్ లో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడారు.పలువు రు వక్తలు కూడా మాట్లాడుతూ, పటేల్ సేవలను స్మరించుకున్నారు. ..దేశాన్ని ఐక్యం చేసిన మహనీయు డు..స్వాతంత్రం వచ్చే సమయానికి చిన్న చిన్న సంస్థలుగా ఉన్న అఖండ భారతదేశాన్ని ఏకం చేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్ కు దక్కుతుందని ప్రిన్సిపల్ తెలిపారు. కాశ్మీర్, నిజాం రాష్ట్రాలను ఎంతో చాకచక్యంతో అఖండ భారతావనిలో ఐక్యం చేశారని కొనియాడారు. మనమందరం కూడా నిత్య జీవితంలో ఐక్యంగా ఉండేందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ ను ఆదర్శంగా తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎంఏ రేష్మ, గజెల్లి మోహన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల కోసం... పోరాటాలకు సిద్ధంగా కావాలి

### ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కే రామస్వామి

### చేవెళ్లలో ఘనంగా ఏఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**రంగారెడ్డి జిల్లా మహా:** ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గ కేంద్రంలోని భూపోరాట కేంద్రంలో, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు కె రామస్వామి హాజరై ఏఐటియుసి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31 వ తేదీన భారతదేశంలో ఏర్పడిన మొట్ట మొదటి కార్మిక సంఘం ఏఐటియుసి అని తెలిపారు. భారతదేశంలో ఆ రోజుల్లో కంపెనీలలో పది గంటల పని విధానం అమలులో ఉండేదని, బాంబేలో నూలు పరిశ్రమలో వేలాదిమంది కార్మికులు చాలీచాలని జీతాలతో అధిక పనిగంటలతో శ్రమ దోపిడీకి గురి అవుతున్న తరుణంలో, 1917వ సంవత్సరంలో రష్యాలో జరిగిన విప్లవము భారతదేశంలో దాని ప్రభావం పడింది. రష్యా విప్లవ స్ఫూర్తితో భారతదేశంలో కార్మికులు రైతులు కర్షకులు సంఘటితమై ఒక కార్మిక సంఘంగా ఏర్పడాలి అని, లాలా లజపతిరాయ్ అధ్యక్షతన 1920 అక్టోబర్ 31వ రోజున ముంబైలో ఏఐటియుసి కార్మిక సంఘం ఏర్పడిందని, ఒకపక్క స్వాతంత్ర పోరాటంలో కార్మిక వర్గం పాలుపంచుకుంటూ కార్మిక హక్కులకు సాధనకై పోరాటం చేస్తూ, స్వాతంత్రం రాక పూర్వమే 44 రకాల కార్మిక చట్టాలను, ఎనిమిది గంటల పని విధానము సాధించడం జరిగిందని పేర్కొన్నారు. దేశంలో 106 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన కార్మిక సంఘం ఏదైనా ఉంది అంటే అది ఒక్క ఏఐటియుసి అని కొనియాడారు. కానీ ఈరోజు దేశంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత, కార్మికులపై దాడి చేయడం మొదలు పెట్టినాడని, కార్పొరేట్ శక్తులకు పెట్టుబడుదారి శక్తులకు కొమ్ము కాస్తూ 44 రకాల చట్టాలను నాలుగు కోడులుగా చేసి, కార్మిక వర్గానికి తీవ్రమైన అన్యాయం చేశాడని, పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాలను తొలగించి, వాటి స్థానంలో 12 గంటల పని దినాలను తీసుకువచ్చాడని, భవిష్యత్తులో కార్మిక వర్గం, మోడీ ప్రభుత్వానికి, తగిన బుద్ధి చెబుతుందని తెలిపారు. కార్మికులకు ఈఎస్ఐ పీఎఫ్ బోనస్ గ్రాటివిటీ మొదలగు సౌకర్యాలను యాజమాన్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గం అంతా సంఘటితం కావలసిన ఆవశ్యకత ఏర్పడిందని, భవిష్యత్తు పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏం ప్రభు లింగం, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, ఏఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యురాలు వడ్ల మంజుల, బికేఎంయు జిల్లా అధ్యక్షుడు జే అంజయ్య, మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి, శంకర్పల్లి మండల పార్టీ కార్యదర్శి సుధీర్, ఏఐటీయూసీ నాయకులు శౌరీలు, బాబు, పెంటయ్య సత్తయ్య, సుధాకర్ గౌడ్, నరసయ్య, అంజమ్మ వెంకటమ్మ, హసన్, శ్రీను, షాబాదు, నర్సింలు, జయమ్మ, స్వరూప, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.







# నేటి నుండి మండలాలలో అంబులెన్స్ సేవలు

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- మండలాల బాధ్యులకు అంబులెన్స్ లను అప్పజెప్పిన ఎమ్మెల్యే

**షాద్ నగర్, మహా:** షాద్ నగర్ నియోజకవర్గంలోని ఫరూక్ నగర్, కొత్తూరు, కొందుర్గు కేశంపేట నందిగామ ఉమ్మడి మండలాలకు ఒక్కో అంబులెన్స్ చొప్పున లిమ్స్ శంషాబాద్ ఆసుపత్రి వారి సౌజన్యంతో నేటినుండి సేవలు అందుబాటులోకి వచ్చాయని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయా మండలాల అంబులెన్స్ బాధ్యులకు వాటిని అప్పచెప్పారు. ఇటీవల విజయదశమి పండుగ రోజున అంబులెన్స్లను నూతనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే శంకర్ దానికి సంబంధించిన సిబ్బందిని ఏర్పాటు చేసి వారికి శిక్షణను అందజేసి నేడు పూర్తిస్థాయిలో మండలాలకు సేవల కోసం వారికి స్వాధీన పరిచినట్లు ఎమ్మెల్యే చెప్పారు. శంషాబాద్ లిమ్స్ ఆస్పత్రి యజమాని రామరాజు సహకారంతో ఈ అంబులెన్స్ సేవలను పేద ప్రజలకు ఉచితంగా పెట్టేందుకు ముందుకు రావడం విశేషమని తెలిపారు. తన రాజకీయ అభివృద్ధి తో పాటు అనేక అంశాల్లో సహకరిస్తూ నియోజకవర్గ ప్రజలకు తమ వంతు సహకారం అందించే విధంగా అంబులెన్స్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి పేదవాడు ఈ అంబులెన్స్ సేవలను ఉచితంగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, షాద్ నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు ఆగిర్యల కృష్ణ రెడ్డి, చెంది తిరుపతి రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చల్ల శ్రీకాంత్ రెడ్డి, జంగ నర్సింహులు, హరినాథ్ రెడ్డి, గూడ విరేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పి వెంకట్ రాంరెడ్డి, కొత్తూరు కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నేతలు అగ్గనూర్ బస్వం, సురేష్ రెడ్డి, జాకరం చంద్ర శేఖర్, యెన్నం శ్రీధర్ రెడ్డి , గిరి యాదవ్, చంద్ర పాల్ రెడ్డి, కొప్పునూర్ ప్రవీణ్ త్రిప్పిశెట్టి కర్ణకర్, కొమ్ము కృష్ణ, బాధేపల్లి సిద్ధార్థ, జాంగారి రవి, హైదర్ ఘోరీ, నెహ్రూ నాయక్, రాజు నాయక్, సుమన్ నాయక్, అన్వర్, అప్పరెడ్డిగూడ మల్లేష్, భాస్కర్ గౌడ్, లింగారెడ్డి గూడ అశోక్, ఖదీర్,సీతారాం, సుఖ్య నాయక్, రాందాస్ నాయక్, బసప్పా, నాగి సాయిలు, కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు..

# మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించిన ఎమ్మెల్యే

**హన్మకొండ మహా;** హనుమకొండలోని, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత దేశ మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ వర్ధంతి అలాగే స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొని, ఇందిరా గాంధీ, సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్వర్ణ మాట్లాడుతూ ఇందిరా గాంధీ దేశ అభివృద్ధి, స్త్రీ సాధికారతకు నిదర్శనం. సర్దార్ వల్లభభాయ్ పటేల్ దేశ ఏకతకు ప్రతీక. వారి ఆలోచనలు, త్యాగం నేటి తరానికి స్ఫూర్తి ప్రదాతలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మణికొండ మున్సిపాలిటీ బీజేపీ కార్యాలయంలో ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు

**గండిపేట, మహా:** మణికొండ మున్సిపాలిటీలోని బిజెపి కార్యాలయంలో శుక్రవారం భాజపా నాయకుల ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ భారతదేశ ఐక్యతను చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి అని అతను చూపిన బాటలోనే నేటి యువత నడవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కే నరేందర్ రెడ్డి, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు బి రవికాంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్ స్వామి, వందన నాగేష్, మాజీ కో ఆప్షన్ మెంబర్ జొన్నాడ లక్ష్మి, సిహెచ్ ఇందిరా, చిలుకూరి బీరప్ప, ప్రధాన కార్యదర్శి శివరాంరెడ్డి వినోద్, కోశాధికారి యాదయ్య, వైస్ ప్రెసిడెంట్ ఆనందరావు, రాజేష్,ఓరిస్ మధు, శంకర్,బి.శివకుమార్,మురళి,భీమిరెడ్డి, మోహన్ రెడ్డి, గణేష్, రాము మరియు భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# బెల్లంపల్లి సుందరీకరణలో భాగంగా ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు

## పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య కూల్చి వేస్తున్న మున్సిపల్ శాఖ

### దుకాణాలను కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తామన్న బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణాభి వృద్ధిలో భాగంగా కాల్ టాక్సీ ఫ్లైఓవర్ సింగరేణి ఆసుపత్రి వద్ద నుండి ఎస్బిఐ బ్యాంకు వరకు రోడ్డు విస్తరణ పనుల ను మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నడుమ శుక్రవారంనాడు కూల్చివే తలకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భం గా మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ మాట్లాడుతూ ఇదివరకే రోడ్డు విస్తరణలో పోతున్న దుకాణాలను గుర్తించి వారికి నోటీసులు ఇవ్వడం జరిగిందని అయినప్పటికీ తొలగించుకొని పక్షంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో 5 జెసిబిలను ఏర్పాటు చేసి రోడ్డు విస్తరణ పనులను చేపట్టామని పేర్కొన్నారు. 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులలో భాగంగా పలువురు దుకాణాలు కోల్పోతున్నందున త్వరలోనే సంబంధిత వ్యక్తులకు షాపులను కేటాయించడం జరుగుతుందని ఇందులో ఎలాంటి అనుమానాలకు తావు లేదని వెల్లడించారు. రోడ్డు విస్తరణ పనులను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించి శాంతియుత వాతావరణంలో చేపట్టాలని, పట్టణాభివృద్ధి లో భాగంగా చేపడుతున్న విస్తరణ పనులకు అందరూ సహకరించాలని సూచించారు. రోడ్డు విస్తరణ పనులలో దుకాణాలనుకోల్పోయిన యజమానులకు త్వరలోనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేపడతామని దుకాణా దారులు ఎవరు ఆందోళన చెందవద్దని తెలిపారు రోడ్డు విస్తరణ పనులలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేలా బెల్లంపల్లి ఏసిపి రవి కుమార్ ఆధ్వర్యంలో వన్టౌన్ శ్రీనివాసరావు సీఐ రూరల్ సీఐ హనూక్, తాండూరు సిఐ దేవయ్య ల ఆధ్వర్యంలో ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బంది చర్యలను చేపట్టారు.ఈ సందర్భంగా దుకాణాలను కోల్పోతున్న వ్యాపారులు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయకుండా దుకాణాలను కూల్చివేయడం ఏమేరకు సబబుఅని ప్రశ్నించారు. సంబంధిత మున్సిపల్ శాఖ తోపాటు ప్రభుత్వం సైతం త్వరితగతిన దుకాణాలను కోల్పోతున్న వ్యాపారులకు సంబంధిత స్థలాలను కేటాయించినట్లయితే తమ జీవన భృతి మెరుగుపడుతుందని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.






# ఉచితంగా గూగుల్ ఏఐ ప్రో

## జియో యూజర్లకు రిలయన్స్ బంపర్ ఆఫర్

**న్యూఢిల్లీ :** జియో వినియోగదారులకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ఓ బంపర్ ఆఫర్ ఇచ్చింది. గూగుల్ భాగస్వామ్యంతో తమ కృత్రిమ మేధస్సు (ఏఐ) సంస్థ రిలయన్స్ ఇంటెలిజెన్స్.. ఎంపికచేసిన జియో కస్టమర్లకు ఏడాదిన్నర (18 నెలలు)పాటు గూగుల్ ఏఐ ప్రో ఉచిత వినియోగానికి అనుమతినిస్తుందని ఆర్ఐఎల్ గురువారం ప్రకటించింది. అయితే రూ.35,100 విలువైన ఈ ఆఫర్.. తొలుత జియో 5జీ యూజర్లకే అందుబాటులో ఉంటుందని పేర్కొన్నది. ఇక ఈ రిలయన్స్‌గూగుల్ ఆఫర్‌లో కస్టమర్లకు జెమిని యాప్‌లో గూగుల్ జెమిని 2.5 ప్రో మాడల్‌కు హైయర్ యాక్సెస్ కూడా ఉంటుంది. అలాగే నానో బనానా, వియో 3.1 మాడల్స్‌తో అద్భుతమైన ఫొటోలు, వీడియోలు తీసుకోవచ్చు. అధ్యయనంపరిశోధనల కోసం నోట్‌బుక్ ఎల్ఎంను వాడుకోవచ్చు. 2టీబీ క్లౌడ్ స్టోరేజీ తదితర సౌలభ్యాలు కూడా ఉంటాయని ఓ ప్రకటనలో ఆర్ఐఎల్ స్పష్టం చేసింది. కాగా, ఓపెన్‌ఏఐ భారత్‌లోని వినియోగదారులకు ఏడాదిపాటు ఉచితంగా 'చాట్‌జీపీటీ గో' సేవలను ఆఫర్ చేసింది. నవంబర్ 4 నుంచి ఈ పరిమిత వ్యవధి ప్రమోషనల్ ఆఫర్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రిలయన్స్ నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. ప్రస్తుతం ఓపెన్‌ఏఐ చాట్‌జీపీటీ గో సేవలు పొందాలంటే నెలకు రూ.399 చెల్లించాల్సి ఉంటుంది.

# కెనరా బ్యాంక్ లాభం 4,774 కోట్లు

**న్యూఢిల్లీ :** కెనరా బ్యాంక్ అంచనాలకుమించి రాణించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.4,774 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,015 కోట్ల లాభంతో పోలిస్తే 19 శాతం ఎగబాకింది. మొండి బకాయిలు తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లో రెండంకెల వృద్ధి నమోదైందని బ్యాంక్ ఎండీ, సీఈవో కే సత్యనారాయణ రాజు తెలిపారు. బ్యాంక్ ఆదాయం రూ.34,721 కోట్ల నుంచి రూ.38,598 కోట్లకు చేరుకున్నట్టు చెప్పారు. దీంట్లో వడ్డీల మీద రూ.31,544 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.35 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ 0.54 శాతానికి దిగొచ్చింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.1,504 కోట్ల నిధులను కేటాయించినట్లు చెప్పారు. బ్యాంకు వద్ద పుష్కలంగా నిధులు ఉన్నాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిధులను సేకరించాల్సిన అవసరం లేదని ఆయన వ్యాఖ్యానించారు.



# వన్నె తగ్గిన బంగారం

## జూలై-సెప్టెంబర్‌లో 16 శాతం పడిపోయిన డిమాండ్


### అధిక ధరలే కారణం: ప్రపంచ స్వర్ణ మండలి వెల్లడి

**న్యూఢిల్లీ :** బంగారానికి (Gold) డిమాండ్ పడిపోయింది. ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన ధరల కారణంగా కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో జూలైసెప్టెంబర్ మధ్యకాలంలో పుత్తడికి డిమాండ్ 16 శాతం పడిపోయిందని ప్రపంచ స్వర్ణ మండలి తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత త్రైమాసికంలో కేవలం 209.4 టన్నుల పుత్తడికి మాత్రమే డిమాండ్ నెలకొన్నదని తెలిపింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 248.3 టన్నులకు డిమాండ్ ఉంది. అయినప్పటికీ విలువ పరంగా చూస్తే మాత్రం భారీగా పెరిగింది. కిందటేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,65,380 కోట్లుగా ఉన్న పుత్తడి ఈసారి త్రైమాసికానికిగాను 23 శాతం ఎగబాకి రూ.2,03,240 కోట్లకు చేరుకున్నది. రికార్డు స్థాయికి చేరుకున్న ధరల కారణంగా డిమాండ్ పడిపోయినప్పటికీ, పెట్టుబడులకు మాత్రం ఇదే సురక్షితమైనదిగా మారిపోయిందని పేర్కొంది. ప్రపంచంలో పసిడి వినిమయంలో రెండో అతి పెద్ద దేశమైన భారత్‌లో బంగారం ఆభరణాల డిమాండ్ కూడా 31 శాతం తగ్గి 117.7 టన్నులకు జారుకున్నది. 700 టన్నులకు డిమాండ్ ప్రస్తుత సంవత్సరంలో భారత్‌లో పసిడి డిమాండ్ 600700 టన్నుల స్థాయిలో ఉంటుందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజాగా తన అంచనాను వెల్లడించింది. గడిచిన తొమ్మిది నెలల్లో భారత్‌లో 462.4 టన్నుల పసిడి విక్రయాలు జరిగాయి. మరోవైపు, మూడో త్రైమాసికంలో అంతర్జాతీయంగా 1,313 టన్నుల బంగారం అమ్మకాలు జరిగాయని తెలిపింది. రికార్డు స్థాయికి చేరుకున్న ధరల కారణంగా పలు దేశాల సెంట్రల్ బ్యాంకులు ఎగబడి కొనుగోళ్లు చేయడం, పెట్టుబడుల డిమాండ్ అధికంగా ఉండటం ఇందుకు కారణమని తన నివేదికలో వెల్లడించింది.



**జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో బంగారం డిమాండ్ తీరు**

దేశీయంగా 209.4 టన్నులకు డిమాండ్ నెలకొన్నది. క్రితం ఏడాది ఇదే కాలానికి ఉన్న 248.3 టన్నులతో పోలిస్తే 16 శాతం తగ్గింది. విలువ పరంగా చూస్తే మాత్రం ఏడాది ప్రాతిపదికన 23 శాతం ఎగబాకి రూ.2,03,240 కోట్లకు చేరుకున్నది. అంతక్రితం ఏడాది ఇది రూ.1,65,380 కోట్లుగా ఉన్నది. ఆభరణాల డిమాండ్ 31 శాతం తగ్గి 117.7 టన్నులకు పరిమితమైంది. 2024లో ఇదే సమయంలో 171.6 టన్నులుగా ఉంది. ఆభరణాల విలువ యథాతంగా నమోదయ్యాయి. కిందటేడాది రూ.1,14,300 కోట్లుగా వున్న ఆభరణాల విలువ ఈసారి రూ.1,14,270 కోట్లుగా నమోదైంది. పసిడిపై పెట్టుబడులు 91.6 టన్నులకు చేరుకున్నాయి. కిందటేడాది 76.7 టన్నులగా ఉన్నది. పసిడిపై పెట్టుబడుల విలువ రూ.51,080 కోట్ల నుంచి 74 శాతం వృద్ధితో రూ.88,970 కోట్లకు చేరుకున్నాయి. 21.8 టన్నుల గోల్డ్‌ను రిసైక్లింగ్ చేశారు. కిందటేడాది ఇదే సమయంలో చేసిన 23.4 టన్నులతో పోలిస్తే 7 శాతం తగ్గింది. గత మూడు నెలల్లో భారత్ 194.6 టన్నుల గోల్డ్‌ను దిగుమతి చేసుకున్నది. కిందటేడాది ఇదే త్రైమాసికంలో దిగుమతి చేసుకున్న 308.2 టన్నులతో పోలిస్తే 37 శాతం తగ్గింది. సరాసరి పదిగ్రాముల బంగారం ధర రూ.97,074.90గా ఉన్నది. గతేడాది ఇది రూ.66,614.1గా నమోదైంది(దిగుమతి, జీఎస్టీ మినహాయింపుతో)



# మెయిల్ చేతికి నేవేలి విద్యుత్ ప్లాంట్

**హైదరాబాద్ :** తమిళనాడులో నేవేలి వద్దవున్న 250 మెగావాట్ల లిగ్నైట్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని మెఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కొనుగోలు చేసింది. అబుదాబి కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న ఈ సంస్థ నిర్వహిస్తున్న విద్యుత్ ప్లాంట్లో వంద శాతం వాటాను హస్తగతం చేసుకున్నట్టు మెఘా గురువారం ప్రకటించింది. ప్రస్తుతం ఇంధన రంగంలో 5.2 గిగావాట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగివున్న మెయిల్..తమిళనాడు ప్లాంట్ కొనుగోలు ద్వారా ఈ రంగంలో తన స్థానాన్ని మరింత బలోపేతం కానున్నట్టు మెయిల్ గ్రూపు సీఎఫ్‌వో సలీల్ కుమార్ మిశ్రా తెలిపారు. నాణ్యత విద్యుత్ ఉత్పత్తి ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతో ఇదొక మైలురాయి వంటిదని పేర్కొన్నారు.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# కేజ్రీవాల్ శీష్ మహల్ 2.0

## బీజేపీ, స్వాతి మలివాల్ సంచలన ఆరోపణలు

**ఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ స్వాతి మలివాల్ ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై సంచలన ఆరోపణలు చేశారు. తన శీష్ మహల్ కోసం పంజాబ్ ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు. అందుకు ఊతం ఇచ్చేలా ఆప్ అధికారంలో ఉన్న పంజాబ్ రాష్ట్రంలో కేజ్రీవాల్ తన రెండో శీష్ మహల్ నిర్మించుకున్నారని దుయ్యబట్టారు. అరవింద్ కేజ్రీవాల్ (Arvind Kejriwal) మరో శీష్ మహల్‌పై (అద్దాల భవనం 2.0) ఎంపీ ఎంపీ స్వాతి మలివాల్, బీజేపీ దాడికి దిగింది. బిగ్ బ్రేకింగ్ అంటూ శీష్ మహల్ 2.0ను ఫోటోను షేర్ చేసింది. పంజాబ్ ప్రజల సొమ్ముతో రాజధాని చండీగఢ్‌లో ఈ అద్దాల మేడను నిర్మించుకున్నారని ట్వీట్‌లో పేర్కొంది. ఈ మేరకు ఢిల్లీ బీజేపీ యూనిట్ ఎక్స్ వేదికగా ఓ ఫొటోను విడుదల చేసింది. బీజేపీ విడుదల చేసిన ఆ ఫొటోలోని ప్రాంతం చండీగఢ్ సెక్టార్ 2లోని ప్రభుత్వ బంగ్లా కాంప్లెక్స్. అందులోనే కేజ్రీవాల్ శీష్‌మహల్ నిర్మించుకున్నారని మండిపడింది. కేజ్రీవాల్‌ను పంజాబ్ "సూపర్ సిఎం"గా అభివర్ణిస్తూ, "ఆమ్ ఆద్మీ (సామాన్యుడు) కావాలని కోరుకుంటున్న ఆప్ చీఫ్ మరో 'శీష్ మహల్'ను నిర్మించారని బీజేపీ విమర్శించింది. కేజ్రీవాల్‌కు ముఖ్యమంత్రి కోటా నుండి 2 ఎకరాల విస్తీర్ణంలో విలాసవంతమైన 7 స్టార్ ప్రభుత్వ బంగ్లాను కేటాయించారంటా విమర్శించింది. మరోవైపు ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి పంజాబ్ ప్రభుత్వ వనరులను వ్యక్తిగత విలాసం కోసం దుర్వినియోగం చేస్తున్నారని స్వాతి మలివాల్ ఆరోపించడం మరింత సంచలనం రేపింది. అరవింద్ కేజ్రీవాల్ పంజాబ్‌లో మరో శీష్ మహల్ అంటూ ఆరోపణలు ఆరోపించారు. మొత్తం పంజాబ్ ప్రభుత్వం ఒక వ్యక్తికి సేవ చేయడంలో నిమగ్నమై ఉందని మలివాల్ ఆరోపించారు. నిన్న, ఆయన (కేజ్రీవాల్) తన ఇంటి ముందు నుండి అంబాలాకు ప్రభుత్వ హెలికాప్టర్‌లో వెళ్లారని, అక్కడి నుంచి పంజాబ్ ప్రభుత్వ ప్రైవేట్ జెట్ ఆయనను పార్టీ పని కోసం గుజరాత్‌కు వెళ్లారని ఆమె ఆరోపించారు. మరోవైపు బీజేపీ తాజా ఆరోపణలపై ఆప్ ఇంకా స్పందించలేదు. అయితే చండీగఢ్ ఆమ్ ఆద్మీ పార్టీ విభాగం ఆ ఆరోపణలను ఖండించింది. ఢిల్లీలో పార్టీ వివరణాత్మక ప్రకటన జారీ చేస్తుందని తెలిపింది. కాగా అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ సీఎంగా ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నంబర్ 6, ఫ్లాగ్ స్టాఫ్ రోడ్డులోని అధికారిక బంగ్లాలో నివసించారు. ఆ సమయంలో దాని మరమ్మతుల కోసం ప్రాథమిక అంచనా వ్యయం రూ.7.91 కోట్లు కాగా.. 2020లో రూ. 8.62 కోట్లకు కాంట్రాక్టు ఇచ్చారు. 2022లో పీడబ్ల్యూడీ శాఖ పనులు పూర్తిచేసే నాటికి ఆ ఖర్చు మూడు రెట్లు పెరిగి మొత్తం బంగ్లా మరమ్మతుల ఖర్చు రూ. 33.36 కోట్లకు చేరుకుందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) అంచనా వేసింది. సెప్టెంబర్ 2024 వరకు అరవింద్ కేజ్రీవాల్ ఆ బంగ్లాలోనే నివాసం ఉన్నారు. బీజేపీ నాయకుడు విజేందర్ గుప్తా ఫిర్యాదుపై కేంద్ర ప్రజా పనుల శాఖ (CPWD) వాస్తవ నివేదికను సమర్పించింది.





# పీరియడ్ సెలవు

## శానిటరీ ప్యాడ్ ఫోటోలు పంపమన్న సూపర్ వైజర్లు

ఒక పక్క మహిళలు, పీరియడ్ సమస్యలను అర్థం చేసుకున్న కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పీరియడ్ లీవ్‌ను ప్రత్యేకంగా ప్రకటిస్తోంటే హర్యానాలోని ప్రముఖ విశ్వ విద్యాలయంలో మహిళా ఉద్యోగుల పట్ల అమానుషంగా ప్రవర్తించిన వైనం కలకలం రపింది. హర్యానాలోని రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ విశ్వవిద్యాలయంలో కొంతమంది మహిళా పారిశుధ్య కార్మికులలు తాము పీరియడ్స్‌లో ఉన్నదీ లేనిదీ రుజువు చేసుకోవాల్సిన దుస్తితిపై తీవ్ర ఆగ్రహం పెల్లుబుకింది. అక్టోబర్ 26నక్యాంపస్‌లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అక్టోబర్ 26న మహర్షి దయానంద్ విశ్వవిద్యాలయాన్ని హర్యానా గవర్నర్ అషిమ్ కుమార్ ఘోష్ సందర్శించారు. ఆదివారం సెలవు అయినప్పటికీ మహిళలతో సహా పారిశుధ్య కార్మికులందరిని విధులకు పిలిచారు. విధుల్లో ఉన్న పారిశుధ్య మహిళలు ఆలస్యంగా వచ్చారు.మరి కొంతమంది సెలవు అడిగారు. రుతుక్రమం, అనారోగ్యంతోఉన్నామని, సిబ్బంది చెప్పినప్పుడు, ఇద్దరు వినోద్, జితేంద్ర సూపర్‌వైజర్లు అబద్ధం ఆడుతున్నారంటూ మండిపడ్డారు. మహిళలకు సెలవు ఇవ్వలేదు సరికదా, ఆధారం కోసం వినియోగించిన శానిటరీ ప్యాడ్ ఫొటోలు పంపాలని వీరు బలవంతం చేశారు. ఉన్నత అధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయంటూ డ్యూటీకి వచ్చిన ఒక మహిళను వాష్‌రూమ్‌కు తీసుకెళ్లి, రుతుక్రమాన్ని మరో మహిళా సిబ్బందితో తనిఖీ చేయించారు. అలాగే ఇలా చేయడానికి నిరాకరించిన మహిళల్ని ఉద్యోగంలోంచి తీసేస్తామని కూడా బెదిరించారు.ఈ నేపథ్యంలో మహిళా పారిశుధ్య సిబ్బంది నిరసన తెలిపారు.వీరికి తోటి మహిళా సిబ్బంది, విద్యార్థి సంఘాలు మద్దతుగా నిలిచాయి. నిరసనకు దిగాయి. దిగ్భ్రాంతి కరమైన సంఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ రంగంలోకి దిగింది. కమిషన్ ఛైర్‌పర్సన్‌తో సంఘటన ఫోటోలు . వీడియోలను కూడా బాధితలు పంచుకున్నారు.

వర్సిటీ రిజిస్ట్రార్ కృష్ణన్ కాంత్ దీనిపై ఇంటర్నల్ దర్యాప్తునకు ఆదేశించింది. మరియు దోషులుగా తేలిన వారిని వదిలిపెట్టబోమని వ్యాఖ్యానించినట్టు తెలుస్తోంది. ఇద్దరు సూపర్‌వైజర్లతోపాటు, మరొకరిపై కేసు నమోదైంది.

కాగా హర్యానాలో మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక పీరియడ్‌లీవ్ విధానమేమీ లేదు. కానీ ఇటీవలి ఆదేశాల ప్రకారం అన్ని మహిళా కాంట్రాక్టు ఉద్యోగులు (హర్యానా కౌశల్ రోజ్‌గార్ నిగమ్ ద్వారా నియమించబడిన వారితో సహా) నెలకు రెండు రోజుల క్యాజువల్ సెలవులు తీసుకోవచ్చు.

# పోలీసులు-నక్సల్స్ మధ్య భీకర పోరు

**రాయ్‌పూర్:** ఛత్తీస్‌గడ్‌తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో మరోమారు తుపాకీ గర్జించింది. 288 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉండే ఈ గుట్టలు తెలంగాణ ప్రాంతంలో 90 కిలోమీటర్ల పొడవునా ఉన్నాయి. ఏప్రిల్, మే నెలల్లో ఇక్కడ భద్రత బలగాలు తొలుత 'బచావో కర్రెగుట్టలు'.. ఆ తర్వాత 'ఆపరేషన్ కర్రెగుట్టలు' పేరుతో నక్సల్స్ ఏరివేతకు 24 వేల మంది పోలీసులను మోహరించాయి. డ్రోన్లతో గుట్టలను జల్లెడ పట్టాయి. అయితే.. ఆరుగురు పీఎల్‌జీ సభ్యుల(వీరిలో ముగ్గురు మహిళలు) ఎన్‌కౌంటర్ మినహా.. పెద్దగా పురోగతిని సాధించలేకపోయాయి.

**ఇప్పుడు మళ్లీ వార్తల్లోకి..**

ఆపరేషన్ సిందూర్ సమయంలో ఛత్తీస్‌గఢ్‌లోని కేంద్ర బలగాలు దేశ సరిహద్దులకు వెళ్లాయి. దీంతో.. ఉన్నఫళంగా ఆపరేషన్ కర్రెగుట్టలకు బ్రేక్ పడింది. ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్ బలగాలు సైతం అబూజ్‌మఢ్‌పైనే ఎక్కువగా ఫోకస్ చేశాయి. కర్రెగుట్టల్లో 30కి పైగా భారీ కొండలు ఉండగా.. అప్పట్లో భద్రతాబలగాలు నీలం కొండ(సరాయ్), దోబే కొండలు, ఆలుబాకల్లో మూడు బేస్ క్యాంపులను ఏర్పాటు చేశాయి. వెయ్యి మంది మావోయిస్టులు తలదాచుకున్న ఓ కలుగును గుర్తించాయి. అంతకు మించితే.. పెద్దగా పురోగతి సాధించింది లేదు. శుక్రవారం ఉదయం భద్రతాబలగాల బేస్ క్యాంపులపై మావోయిస్టులు మెరుపు దాడులు చేసినట్లు సమాచారం. ''కేంద్ర బలగాలు కొత్త క్యాంపును ఏర్పాటు చేసే క్రమంలో కర్రెగుట్టల్లోకి వెళ్లాయి. ఆ సమయంలో మావోయిస్టులు కాల్పులు జరిపారు. దానికి ప్రతిగా భద్రతా బలగాలు ఎదురు కాల్పులకు దిగాయి. సుమారు గంట పాటు కాల్పులు కొనసాగాయి. ఇరువైపులా ప్రాణనష్టం జరిగిన దాఖలాలు కనిపించడం లేదు'' అని ఓ అధికారి 'సాక్షి డిజిటల్'కు వివరించారు.



**ఇంకా 400 మంది మావోయిస్టులు?**

తాజా ఘటనతో కర్రెగుట్టల్లో ఇంకా 400 మంది దాకా మావోయిస్టులు తలదాచుకుని ఉంటారని కేంద్ర బలగాలు భావిస్తున్నాయి. గతంలో జరిగిన ఎన్‌కౌంటర్ల సందర్భంలోనూ పీఎల్‌జీ దళ కమాండర్లు మృతిచెందారని, ఇప్పుడు కూడా హిడ్మా నేతృత్వంలోని పీఎల్‌జీ ఒకటో బెటాలియన్ దళానికి చెందిన మావోయిస్టులు కర్రెగుట్టల్లోని కొండల్లో తలదాచుకుని ఉంటారని అభిప్రాయపడుతున్నాయి. తాజా ఘటనతో పోలీసులు కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. అయితే.. మోంథా తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలతో కర్రెగుట్టల్లో నడక కష్టంగా మారిందని, బురద, ఊబులతో ప్రమాదం పొంచి ఉందని బలగాలు భావిస్తున్నాయి. కూంబింగ్ మార్గాల్లో విష సర్పాలు కనిపిస్తున్నట్లు చెబుతున్నాయి. దాంతో.. డ్రోన్ల సాయంతో కూంబింగ్‌కు సన్నాహాలు చేస్తున్నాయి.




## దళపతి విజయ్ కుమారుడు సంజయ్ డైరెక్షన్‌లో
# సందిప్ కిషన్ చిత్రం ..

టాలెంట్ ఉన్నా కూడా లక్ కొంచెం కూడా కలిసిరాని హీరోల్లో సందీప్ కిషన్ ఒకరు. దాదాపు 15 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నప్పటికీ, కెరీర్‌ను నిలబెట్టే పెద్ద హిట్ మాత్రం ఇంకా ఆయన ఖాతాలో పడలేదు. మధ్య మధ్యలో కొన్ని సినిమాలు హిట్స్‌గా నిలిచినా, ఆయనకు కావాల్సిన క్రేజ్ మాత్రం రాలేదు. అయినప్పటికీ సందీప్ పట్టు వదలకుండా, కొత్త కథలతో ప్రయోగాలు చేస్తూనే ఉన్నాడు. గతేడాది విడుదలైన మజాకా సినిమా నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో వచ్చినప్పటికీ, ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. అయినా కూడా సందీప్ కిషన్ నిరుత్సాహపడకుండా, కొత్త దిశగా ముందుకు సాగుతున్నాడు. ఇప్పుడు ఆయన కెరీర్‌లో మరో ఇంట్రెస్టింగ్ టర్న్ రాబోతోంది. కోలీవుడ్ స్టార్ దళపతి విజయ్ కుమారుడు సంజయ్ విజయ్ దర్శకత్వంలో సందీప్ కిషన్ హీరోగా ఒక బైలింగ్వల్ మూవీ (తెలుగు – తమిళ్) చేయబోతున్నారు. సంజయ్ డైరెక్షన్‌లో ఇది తొలి సినిమా కావడం విశేషం. బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇచ్చినట్టే, ఇప్పుడు దళపతి విజయ్ తనయుడు సంజయ్ కూడా డైరెక్టర్‌గా సినీ రంగంలో అడుగుపెడుతున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు కోలీవుడ్‌లో ఇప్పటికే మంచి క్రేజ్ ఏర్పడింది.


సినిమా అనౌన్స్‌మెంట్ ఎప్పుడో జరిగినప్పటికీ, షూటింగ్ మాత్రం ఇంకా మొదలుకాలేదు. సమాచారం ప్రకారం, విజయ్ రాజకీయ కార్యక్రమాలు, ఇటీవల పార్టీ మీటింగ్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనల వల్ల సినిమా లాంచింగ్ కొంత వాయిదా పడిందట. అయితే సంజయ్ – సందీప్ కిషన్ సినిమా త్వరలోనే పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. ఇదే సమయంలో సందీప్ కిషన్, దర్శకుడు కృష్ణ చైతన్య దర్శకత్వంలో మరో సినిమా చేయబోతున్నారు. ఈ సినిమా టైటిల్‌ను 'పవర్ పేట' పేట గా ఫిక్స్ చేసినట్లు సమాచారం. జనవరిలో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లే అవకాశం ఉంది. తెలుగులో సక్సెస్ కోసం ప్రయత్నాలు చేస్తున్న సందీప్, తమిళ్ ఇండస్ట్రీలో మాత్రం బాగా యాక్టివ్‌గా ఉన్నారు. ఆయన ధనుష్ రాయన్ వంటి సినిమాల్లో కీలక పాత్రలు పోషించారు. దీంతో తమిళ ప్రేక్షకుల్లో కూడా ఆయనకు మంచి గుర్తింపు ఏర్పడింది. అయితే సంజయ్‌తో చేసే ఈ సినిమా ద్విభాషా ప్రాజెక్ట్ కావడంతో, సందీప్ కిషన్‌కు తమిళ్ మార్కెట్‌లో పెద్ద బ్రేక్ దక్కే అవకాశం ఉంది. కోలీవుడ్ వర్గాల ప్రకారం, సంజయ్ – సందీప్ కిషన్ మధ్య మంచి స్నేహం కూడా ఉందట. అందుకే తన తొలి సినిమా కోసం ఆయనను హీరోగా ఎంచుకున్నాడని తెలుస్తోంది.



## ది ప్యారడైజ్‌లో నాయికగా?

'అల్లూరి' చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయమైంది అస్సామీ సుందరి కయాదు లోహర్. అయితే ఆ సినిమా నిరాశపరడచంతో తమిళ, మలయాళ భాషలపై దృష్టిపెట్టింది. ప్రస్తుతం ఈ భామ తమిళంలో వరుస సినిమాలతో బిజీగా ఉంది. తెలుగులో విశ్వక్‌సేన్‌తో కలిసి 'ఫంకీ' చిత్రంలో నటిస్తున్నది. తాజా సమాచారం ప్రకారం తెలుగులో ఈ భామ బంపరాఫర్‌ను సొంతం చేసుకున్నట్లు తెలిసింది. నాని 'ది ప్యారడైజ్' చిత్రంలో ఆమెను కథానాయికగా ఖరారు చేశారని సమాచారం. హైదరాబాద్ నేపథ్యంలో పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రానికి శ్రీకాంత్ ఓదెల దర్శకుడు. జడల్ పాత్రలో నాని ఫస్ట్‌లుక్ సినిమాపై అంచనాల్ని పెంచింది. కొంతకాలంగా కథానాయిక అన్వేషణలో ఉన్న చిత్రబృందం చివరకు కయాదు లోహర్‌ను ఎంపిక చేసినట్లు తెలిసింది. ఎట్టకేలకు ఈ భామ తెలుగులో భారీ ఆఫర్‌ను సొంతం చేసుకున్నదని, ఆమె కెరీర్‌కు మంచి బ్రేక్‌నిచ్చే చిత్రమవుతుందని అంటున్నారు. 'ది ప్యారడైజ్' చిత్రం వచ్చే ఏడాది మార్చిలో ప్రేక్షకుల ముందుకురానుంది.

## రవితేజ మాస్ జాతర..
### బాహుబలి దెబ్బతో వరస్ట్ రికార్డ్!




మాస్ మహారాజా తాజాగా మరో యాక్షన్ మూవీతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. భాను భోగవరపు దర్శకత్వంలో వస్తోన్న మాస్ జాతర ప్రీమియర్స్ ఈ రోజు నుంచే థియేటర్లలో సందడి చేయనున్నాయి. అక్టోబర్ 31 రిలీజవుతుందని ప్రకటించినా మేకర్స్.. బాహుబలి ది ఎపిక్ దెబ్బకు ప్రీమియర్స్‌కే పరిమితయ్యారు. దీంతో మాస్ జాతర ఫస్ట్ డే కలెక్షన్స్‌పై ఎఫెక్ట్ పడింది. ఇప్పటి వరకు అడ్వాన్స్ బుకింగ్స్ చూస్తే రూ.61 లక్షలకే పరిమితమైంది. బాహుబలి ది ఎపిక్ రిలీజ్ కావడతో మాస్ జాతరకు ఆశించిన స్థాయిలో వసూళ్లు వచ్చేలా కనిపించడం లేదు.

బాక్సాఫీస్ వద్ద బాహుబలి ది ఎపిక్ మూవీతో మాస్ జాతరకు గట్టి పోటీ ఎదురవుతోంది. ప్రముఖ ట్రేడింగ్ వెబ్ సైట్ సాక్నిల్క్ ప్రకారం అడ్వాన్స్ బుకింగ్స్ ఇప్పటివరకు రూ. కోటి కూడా దాటలేదు. అడ్వాన్స్ బుకింగ్స్‌తో శుక్రవారం మధ్యాహ్నం వరకు కేవలం రూ.61 లక్షలు మాత్రమే వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మూవీ ప్రీమియర్స్ సాయంత్రం రిలీజ్ చేయడం.. తక్కువ షోలు వేయడం కూడా వసూళ్లపై ప్రభావం పడిందని చెప్పొచ్చు. ఉదయమే ప్రీమియర్స్‌తో పాటే మూవీ రిలీజ్ అయి ఉంటే వసూళ్ల పరంగా మాస్ జాతరకు కలిసొచ్చేది.

ఓవరాల్‌గా చూస్తే శుక్రవారం ప్రీమియర్స్‌తో కలిపి రూ.2 నుంచి 3 కోట్ల వరకు వసూళ్లు సాధించవచ్చని ట్రేడ్ వర్గాల అంచనా. గతేడాది రిలీజైన రవితేజ మిస్టర్ బచ్చన్ మూవీ వసూళ్ల కంటే తక్కువే. ఈ సినిమా తొలి రోజే రూ.3.45 కోట్లు వసూలు చేసింది. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రాణించలేకపోవడంతో రవితేజ కెరీర్‌లో డిజాస్టర్‌గా నిలిచింది. వీకెండ్‌లో మాస్ జాతర రిలీజ్ కావడం నిర్మాతకు కలిసి వచ్చే ఛాన్స్ ఉంది. ఈ లెక్కన శని, ఆది వారాల్లోనైనా మాస్ జాతర వసూళ్లు పుంజుకునే అవకాశముంది. కాగా.. మాస్ జాతరలో శ్రీలీల హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ బ్యానర్లపై నిర్మించారు.

## నిర్మాతలని ఇబ్బంది పెడుతున్నాడా?
# డీవీవీ సంస్థ ట్వీట్

డైరెక్టర్ ప్రశాంత్ వర్మ పేరు చెప్పగానే 'హనుమాన్' సినిమా గుర్తొస్తుంది. అంతకు ముందు పలు చిత్రాలతో ఆకట్టుకున్నప్పటికీ ఈ మూవీ అద్భుతమైన హిట్ కావడం.. ఇతడి పేరుని పాన్ ఇండియా లెవల్లో మార్మోగిపోయేలా చేసింది. ఈ ఊపులో ప్రశాంత్ వర్మకు పలువురు బడా నిర్మాతల నుంచి ఆఫర్స్ వచ్చాయి. ఇప్పుడు అవే ఇతడిని ఇబ్బందుల్లో పడేసినట్లు తెలుస్తోంది. ఈ విషయమే ఇండస్ట్రీలో ప్రస్తుతం హాట్ టాపిక్ అయిపోయింది. 'హనుమాన్' రిలీజై ఇప్పటికి రెండేళ్లు అయింది. మధ్యలో ప్రశాంత్ వర్మ చేయాల్సిన రెండు సినిమాలు ఆగిపోయాయి. అందులో బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్‌తో అనుకున్నది ఒకటి కాగా, బాలకృష్ణ కొడుకు మోక్షజ్ఞతో అనుకున్న మూవీ మరొకటి. ఇవి ఆగినప్పటికీ ప్రశాంత్ వర్మ ఖాళీగా అయితే లేడు. తన సినిమాటిక్ యూనివర్స్‌లో 'మహాకాళి' తీస్తున్నాడు. దీనికి కేవలం దర్శకత్వ పర్యవేక్షణ చేస్తుండగా.. 'జై హనుమాన్'కి దర్శకత్వం వహించాల్సి ఉంది. 'హనుమాన్' హిట్ అయిన తర్వాత ప్రశాంత్ వర్మ.. టాలీవుడ్ బడా నిర్మాణ సంస్థల నుంచి అడ్వాన్సులు బాగానే తీసుకున్నాడట. మీకే నెక్స్ట్ సినిమా చేసి పెడాతనని మాట కూడా ఇచ్చాడట. అలా రూ.80100 కోట్ల వరకు అడ్వాన్సులు రూపంలో రాగా.. ఆ మొత్తంతో హైదరాబాద్‌లోని సొంతంగా ఓ స్టూడియోని నిర్మించుకున్నాడట.



ఇప్పుడు అందరూ నిర్మాతలు, ప్రశాంత్ వర్మని కొత్త మూవీస్ గురించి అడిగేసరికి.. నేను స్టోరీ ఇస్తాను, దర్శకత్వ పర్యవేక్షణ చేస్తాను గానీ డైరెక్షన్ చేయనని అంటున్నాడట. దీంతో సదరు నిర్మాతలు.. ఇతడిపై ఫిర్యాదు చేసేందుకు ఫిల్మ్ ఛాంబర్‌కి వెళ్లే ఆలోచనలో ఉన్నారట. మరోవైపు డైరెక్టర్ ప్రశాంత్ వర్మకు తమ సంస్థ నుంచి ఎలాంటి అడ్వాన్సులు ఇవ్వలేదని, లావాదేవీలు జరపడం లాంటివి చేయలేదని 'ఓజీ' తీసిన డీవీవీ ఎంటర్ టైన్‌మెంట్స్ సంస్థ ట్వీట్‌తో క్లారిటీ ఇచ్చింది. దీంతో ఇండస్ట్రీలో వినిపిస్తున్న మాటలు నిజమేనా అనే సందేహం కలుగుతోంది. ఒకటి రెండు రోజుల్లో ఈ విషయమై కచ్చితంగా మిగతా నిర్మాణ సంస్థలు కూడా స్పందించే అవకాశముందేమో! అప్పటివరకు వెయిట్ అండ్ సీ.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన సల్మాన్ ఖాన్



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ కలిశారు. గురువారం రాత్రి ముంబైలో సీఎంతో కొంత సమయం పాటు సల్మాన్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ విజన్2047' పేరిట ఒక డాక్యుమెంట్ రూపొందిస్తున్న విషయం తెలిసిందే. రాబోయే 20 ఏళ్లలో తెలంగాణ ఎలా ఉండాలని కోరుకుంటున్నారనే కోణంలో రాష్ట్ర పౌరులు తమ ఆలోచనలు, సూచనలను ఈ సర్వేలో చెప్పవచ్చు. దీనిని అందరికీ తెలిసేలా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే సల్మాన్ కూడా తెలంగాణ గురించి స్పందించారు. రాష్ట్రం చాలా వేగవంతంగా పురోగతి చెందుతుందని ఆయన చెప్పుకొచ్చారు. తెలంగాణ రైజింగ్ సందేశాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.



## చాన్నాళ్లుగా ప్రేమ.. చిన్న వయసులోనే పెళ్లి

సాధారణంగా సినిమా ఇండస్ట్రీ అంటే పెళ్లి విషయంలో కాస్త ఆలస్యం చేస్తుంటారు. ఈ ఏడాది 'టూరిస్ట్ ఫ్యామిలీ' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన అభిషన్ జీవింత్ అనే కుర్రాడు.. ఇప్పుడు చిన్న వయసులోనే వివాహం చేసుకున్నాడు. చాన్నాళ్లుగా ప్రేమిస్తున్న అఖిల అనే అమ్మాయికి మూడు ముళ్లు వేశాడు. శుక్రవారం ఉదయం చెన్నైలోని పోయెస్ గార్డెన్‌లో ఈ వేడుక జరిగింది. ఇందుకు సంబంధించి ఓ ఫొటో కూడా బయటకొచ్చింది. యూట్యూబర్‌గా కెరీర్ మొదలుపెట్టిన అభిషన్.. 'టూరిస్ట్ ఫ్యామిలీ'తో దర్శకుడిగా మారి అద్భుతమైన సక్సెస్ అందుకున్నాడు. రూ.7 కోట్ల బడ్జెట్ పెడితే దాదాపు రూ.8090 కోట్ల కలెక్షన్ ఈ మూవీకి వచ్చాయి. ఇదే చిత్రంలోనూ నటుడిగా ఆకట్టుకున్న ఇతడు.. రీసెంట్‌గా హీరోగా ఓ మూవీ పూర్తి చేశాడు. రజనీకాంత్ కూతురు నిర్మిస్తున్న ఈ చిత్రంలో అనస్వర రాజన్ హీరోయిన్. మరోవైపు అభిషన్‌కి రీసెంట్‌గానే 'టూరిస్ట్ ఫ్యామిలీ' నిర్మాత మగేశ్ రాజ్.. ఖరీదైన బీఎండబ్ల్యూ కారుని పెళ్లి బహుమతిగా ఇచ్చాడు. గురువారం చెన్నైలో రిసెప్షన్ జరగ్గా.. పలువురు తమిళ సినీ సెలబ్రిటీలు హాజరైన కొత్త జంటని దీవించారు. ఇప్పుడు పెళ్లి కూడా జరగడంతో నూతన వధూవరుల్ని కూడా ఆశీర్వదిస్తున్నారు. పెళ్లి వేడుకకు పెళ్లికొడుకు, పెళ్లికూతురి కుటుంబ సభ్యులు, కొందరు స్నేహితులు మాత్రమే హాజరయ్యారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com